thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

ఓ మహాదర్శకుడి నిష్క్రమణ



12

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 76 | జగిత్యాల | గురువారం | 11 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |



# ఫ్యూచర్ సిటీ జోలికొస్తే బండకేసి కొడతాం!

- టోక్యో, సింగపూర్ నగరాలతో పోటీపడేలా భవిష్యత్ నగరం
- బతుకమ్మ కుంటను రాసిచ్చిన కేసీఆర్.. కబ్జాదారుల కోరలు పీకుతాం
- తీరు మార్చుకోకపోతే బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదు
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ ప్రతిష్టను ప్రపంచస్థాయికి తీసుకెళ్లే ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూస్తే ప్రజలు బండకేసి కొడతారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో హెచ్చరించారు. బుధవారం ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగారు. చెరువులను కబ్జా చేసి ఫామ్ హౌస్‌లలో కుట్రలు పన్నే వారి కోరలు పీకి, తోకలు కత్తిరిస్తామని తేల్చిచెప్పారు. తీరు మార్చుకోకపోతే బీఆర్ఎస్‌కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కదని ఆయన స్పష్టం చేశారు.

# 12 ఏళ్లలో దేశ రూపురేఖలు మార్చాం

- కాంగ్రెస్ పాపాలను కడుక్కుంటూ వచ్చాం
- 'వికసిత్ భారత్-2047' లక్ష్యంగా వేగంగా ముందుకు వెళ్తున్నాం
- ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

2



కాంగ్రెస్ పాలనలో దేశంలోని వ్యవస్థలు దెబ్బతిన్నాయని, వేల కోట్ల రూపాయల కుంభకోణాలతో దేశాభివృద్ధి వెనక్కి వెళ్లిందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత మాటలతో కాదు, చేతలతో అభివృద్ధి చేసి చూపించామని ఆయన పేర్కొన్నారు. ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశంలో మోదీ ప్రసంగించారు. దేశ ప్రజలు తనకు 12 ఏళ్లపాటు ప్రధానిగా పనిచేసే అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని, అందుకు 140 కోట్ల మంది భారతీయులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.



# సైబర్ టవర్స్ సమీపంలో రూ.3,000 కోట్ల ప్రభుత్వ భూమికి రక్షణ

2

15 ఎకరాలకు హైడ్రా ఫెన్సింగ్ ■ హైకోర్టు ఆదేశాలతో చర్యలు

# ఫార్మాకు దన్ను

ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పూర్తి సహకారం
సచివాలయంలో ఘనా ప్రతినిధి బృందంతో భేటీ
అక్కడ ఫార్మా హబ్ ఏర్పాటుకు రాష్ట్రం తోడ్పాటు
వెల్లడించిన మంత్రి శ్రీధర్ బాబు



2



# ఉత్తర తెలంగాణకు ప్రాధాన్యం

- రూ.106 ఎత్తిపోతల పథకాలు ప్రారంభం
- కాలువల కట్టలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తి
- ధాన్యం డబ్బులు 48 గంటల్లోనే జమ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- సిద్ధాపూర్ రిజర్వాయర్ పనుల పరిశీలన

3



# ఫుట్‌పాత్‌లను లీజుకు ఎలా ఇస్తారు?

మెట్రో స్టేషన్ల కింద స్టాళ్ల ఏర్పాటుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

2

# ప్రాంతీయ విద్వేషాలు దేశానికి ప్రమాదకరం

- జనసేన పుట్టిందే తెలంగాణ గడ్డపై..
- జాతీయ మీడియాతో పవన్ కల్యాణ్



వివరాలు 3లో..



# భార్యపై కాల్పులు!

అనుమానంతో దారుణానికి ఒడిగట్టిన వ్యాపారి

అక్కడికక్కడే ప్రాణాలు విడిచిన ఇల్లాలు

2

మల్కాజిగిరి పరిధిలో దారుణ ఘటన

# ఆపరేషన్ క్రాక్ డౌన్

- 127 మంది సైబర్ నేరస్తుల పట్టివేత
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో వెల్లడి

2






# సింగరేణి సరికొత్త రికార్డు!

పర్యావరణ పరిరక్షణలో గుర్తింపు

- దోర్లి-2 మైన్ క్లోజర్‌తో నలభై కోట్ల డిపాజిట్ వాపస్
- త్వరలోనే దోర్లి-1 నుంచి మరో అరవై కోట్లు వచ్చే అవకాశం
- బాధ్యతాయుత గనుల తవ్వకాల్లో బెంచ్‌మార్క్‌గా సింగరేణి

3



# పీవోకేలో కూలిన పాక్ హెలికాప్టర్

- 21 మంది సైనికులు మృతి

4

పాకిస్థాన్ ఆర్మీ హెలికాప్టర్ కూలి, 21 మంది సైనికులు చనిపోయినట్లుగా సమాచారం.

# గ్రెనేడ్ పేలుడు విషాదం

■ ఉరిలో దుర్ఘటన ఘటన ■ ఇద్దరు జవాన్ల మృతి

దేశ సరిహద్దుల భద్రత కోసం విధులు నిర్వహిస్తున్న భారత సైన్యంలో విషాదం చోటుచేసుకుంది. జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా ఉరి సెక్టార్‌లో ఉన్న కమాల్‌కోట్ సైనిక శిబిరంలో ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలడంతో ఇద్దరు భారత జవాన్లు ప్రాణాలు కోల్పోయారు.

4





# ఘనాకు తెలంగాణ దన్ను!

**ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పూర్తి సహకారం**

**సచివాలయంలో ఘనా ప్రతినిధి బృందంతో భేటీ**

**అక్కడ ఫార్మా హబ్ ఏర్పాటుకు రాష్ట్రం తోడ్పాటు**

**వెల్లడించిన మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, జూన్ 10:** పశ్చిమాఫ్రికా దేశమైన ఘనా పారిశ్రామిక అభివృద్ధికి తెలంగాణ పూర్తి సహకారం అందిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో తెలంగాణ నైపుణ్యాన్ని పంచుకోవడంతో పాటు, అక్కడ ఫార్మా తయారీ హబ్ ఏర్పాటుకు అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఘనా అధ్యక్ష సలహాదారు అగస్టస్ ఒబువాడమ్ టానో నేతృత్వంలోని అత్యున్నత స్థాయి ప్రతినిధి బృందం బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో సమావేశమైంది. ద్వైపాక్షిక సహకారం బలోపేతం, పారిశ్రామిక అభివృద్ధి, ఫార్మా తదితర రంగాల్లో ఉమ్మడి ప్రగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఘనాలో అమలు చేస్తున్న ఇరవై నాలుగు గంటల ఆర్థిక వ్యవస్థ, ఎగుమతుల అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, ఫార్మా హబ్ ఏర్పాటు ప్రణాళికలను టానో ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. పారిశ్రామిక వృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ సాధించిన విజయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ నైపుణ్యాన్ని తమకు అందించాలని ఆయన కోరారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, రక్షణ తదితర రంగాల్లో తెలంగాణ ప్రధాన పెట్టుబడుల గమ్యస్థానంగా అవతరించిందని ప్రతినిధి బృందానికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక అనుకూల విధానాలు, సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వృద్ధిని వేగవంతం చేశాయన్నారు. ఫార్మా తయారీ, పరిశోధన, వ్యాక్సిన్ ఉత్పత్తి, గ్లోబల్ సప్లై చైన్ మేనేజ్మెంట్ రంగాల్లో తమ నైపుణ్యాన్ని పంచుకునేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందన్నారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తన ప్రయాణంలో తెలంగాణ నమ్మకమైన భాగస్వామిగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. నాలెడ్జ్ షేరింగ్, ఉమ్మడి భాగస్వామ్యాలపై ఈ సమావేశంలో ఇరువర్గాలు ఆసక్తి వ్యక్తం చేశాయి.

# ఫుట్‌పాత్‌లను లీజుకు ఎలా ఇస్తారు?

**మెట్రో స్టేషన్ల కింద స్టాళ్ల ఏర్పాటుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం**

**పాదచారులకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకునేది లేదని స్పష్టీకరణ**

**పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశాలు**

**తదుపరి విచారణ ఈ నెల పదిహేడో తేదీకి వాయిదా**

**హైదరాబాద్, జూన్ 10:** పాదచారులు నడిచే ఫుట్‌పాత్‌లను వాణిజ్య స్టాళ్లకు లీజుకు ఎలా ఇస్తారని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మెట్రో స్టేషన్ల కింద పాదచారుల కోసం కేటాయించిన స్థలాల్లో వాణిజ్య స్టాళ్లు ఏర్పాటు చేయడంపై దాఖలైన పిటిషన్‌ను బుధవారం విచారించిన హైకోర్టు.. ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగిస్తే సహించేది లేదని తేల్చిచెప్పింది. మెట్రో స్టేషన్ల కింద పాదచారులు నడిచే ప్రాంతాలను లీజుకు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈ విచారణ సందర్భంగా న్యాయవాది విజయ్ గోపాల్ పలు కీలక వివరాలను న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. మెట్రో స్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల విషయంలో జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని కోర్టుకు తెలిపారు. వీధి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకునే అధికారులు.. మెట్రో కింద ఉన్న వాణిజ్య స్టాళ్ల విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. పిటిషనర్ వాదనలు విన్న హైకోర్టు.. ఫుట్‌పాత్ స్థలాన్ని లీజుకు లేదా అద్దెకు ఎలా ఇస్తారని అధికారులను ప్రశ్నించింది. పాదచారుల కోసం ఉద్దేశించిన ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి ఇవ్వడం ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తుందని అభిప్రాయపడింది. ఈ ఫిర్యాదుపై ఇప్పటివరకు ఏమేం చర్యలు చేపట్టారో పూర్తి నివేదికను సమర్పించాలని జీహెచ్ఎంసీ, హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ (హెచ్ఎంఆర్ఎల్) అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను ఈ నెల పదిహేడో తేదీకి వాయిదా వేసింది. ఉన్నత న్యాయస్థానం తాజా ఆదేశాల నేపథ్యంలో మెట్రో స్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల వ్యవహారం నగరంలో మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# భార్యపై కాల్పులు!

**అనుమానంతో దారుణానికి ఒడిగట్టిన వ్యాపారి**

**అక్కడికక్కడే ప్రాణాలు విడిచిన ఇల్లాలు**

**మల్కాజిగిరి పరిధిలో దారుణ ఘటన**



**హైదరాబాద్, జూన్ 10:** భార్యపై అనుమానం పెంచుకున్న ఒక స్థిరాస్తి వ్యాపారి.. తుపాకీతో ఆమెను కాల్చి చంపాడు. ఈ దారుణ ఘటన నగరంలోని మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మారుతినగర్‌లో నివాసం ఉంటున్న అరుణ్ కుమార్ స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మాట్లాడుకుందామని చెప్పి తెల్లవారుజామున మరో వ్యక్తితో కలిసి ఇంటికి వచ్చిన అరుణ్.. భార్య నిషా రాణిపై తుపాకీతో కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కాల్పుల శబ్దం విన్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మొదటి భార్యకు విడాకులిచ్చిన అరుణ్ కుమార్.. ఆమె సోదరినే ప్రేమ వివాహం చేసుకున్నాడు. మూడు నెలల క్రితం అంబర్‌పేటలో పోలీసుల వాహన తనిఖీల్లో అరుణ్ కుమార్ తుపాకీతో పట్టుబడ్డాడు. అధికారులు ఆ తుపాకీని సీజ్ చేయడంతో.. పాతబస్తీకి చెందిన స్నేహితుల ద్వారా అతడు మరో తుపాకీ కొనుగోలు చేసి ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

# ఫ్యూచర్ సిటీ జోలికొస్తే బండకేసి కొడతాం!

- టోక్యో, సింగపూర్ నగరాలతో పోటీపడేలా భవిష్యత్ నగరం
- బతుకమ్మ కుంటను రాసిచ్చిన కేసీఆర్.. కబ్జాదారుల కోరలు పీకుతాం
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- తీరు మార్చుకోకపోతే బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదు

**హైదరాబాద్, జూన్ 10:** తెలంగాణ భవిష్యత్తు కోసం నిర్మిస్తున్న 'ఫ్యూచర్ సిటీ'ని రద్దు చేస్తామంటూ ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భవిష్యత్తు నగరాన్ని రద్దు చేస్తామంటే ప్రజలు బండకేసి కొడతారని హెచ్చరించారు. బుధవారం ఫ్యూచర్ సిటీలో నూతనంగా నిర్మించిన అభివృద్ధి సంస్థ భవనంతో పాటు లోగో, వెబ్‌సైట్‌ను ఆయన ఆవిష్కరించారు. అభివృద్ధిని అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్న బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రాజకీయంగా నూకలు చెల్లాయని దుయ్యబట్టారు. గతంలో ఔటర్ రింగ్ రోడ్డు, హైటెక్ సిటీ, జినోమ్ వ్యాలీ నిర్మాణాలను కూడా ఇలాగే అడ్డుకోవాలని చూశారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఒకవేళ ఆనాడు నగర విస్తరణ జరగకపోయి ఉంటే నేడు పది లక్షల మంది ఐటీ నిపుణులు ఇక్కడ రాణించేవారా అని ప్రశ్నించారు. ప్రస్తుతం కొందరు శుక్రాచార్యులు ఫామ్‌హౌస్‌లో కూర్చొని కుట్రలు పన్నుతుంటే.. మరికొందరు మారీచులు, సుబాహులు జనంలోకి వచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కడుపు నిండా విషం నింపుకొని ప్రాజెక్టులను అడ్డుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఏడ్చేవాళ్లు ఏడుస్తూనే ఉంటారని, తాము అభివృద్ధి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. కేవలం రెండు గంటల వర్షానికే హైదరాబాద్ వరదమయమైందని.. ఇదేనా మీ పదేళ్ల అభివృద్ధి అని గత పాలకులను నిలదీశారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తే ఏమాత్రం సహించేది లేదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. అంబర్‌పేటలోని బతుకమ్మకుంటను ఎడ్ల సుధాకర్‌కు కేసీఆర్ రాసిచ్చారని ఆరోపించారు. బతుకమ్మ కుంట ఏమైనా ఆయన తాత ఆస్తినా అని ప్రశ్నించారు. ఆనాటి పాలకులు ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా ఆక్రమించుకున్నారని.. అందుకే తాము హైడ్రాను ఏర్పాటు చేసి అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్నామని స్పష్టం చేశారు. చెరువులను పునరుద్ధరిస్తూ లేక్ ఎకానమీని సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కబ్జాకోరులు ఎంత బాధపడినా తమ ఉక్కుపాదం ఆగదని.. వారి కోరలు పీకి, తోకలు కత్తిరిస్తామని ఘాటుగా హెచ్చరించారు. తెలంగాణకు వస్తున్న ఆదాయంలో అరవై శాతం కేవలం హైదరాబాద్ నుంచే వస్తోందని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ కార్యాలయ భవనాన్ని కేవలం నూట యాభై రోజుల్లోనే పూర్తి చేశామని అభినందించారు. వచ్చే ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. రెండు వేల ముప్పై నాలుగు నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించడమే లక్ష్యంగా ఈ నగరం అభివృద్ధి చెందాలని



ఆకాంక్షించారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచ దేశాలను ఇక్కడికి రప్పించామని.. రాబోయే డిసెంబర్‌లోనూ మరో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తామని ప్రకటించారు. బీఆర్ఎస్ అనేది చెల్లకుండా పోయిన రద్దయిన నోటు లాంటిదని, ప్రజలు ఇప్పటికే ఆ పార్టీని తిరస్కరించారని గుర్తుచేశారు. ఇలాగే వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కదని హెచ్చరించారు.

# రూ.3,000 కోట్ల ప్రభుత్వ భూమికి రక్షణ

- 15 ఎకరాలకు హైడ్రా ఫెన్సింగ్..
- హైకోర్టు ఆదేశాలతో చర్యలు

**హైదరాబాద్, జూన్ 10:** హైటెక్ సిటీ సైబర్ టవర్స్ సమీపంలోని మాదాపూర్ ఖానామెట్‌లో అత్యంత విలువైన సుమారు 15 ఎకరాల ప్రభుత్వ భూమిని 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) బుధవారం తన ఆధీనంలోకి తీసుకుంది. ఈ భూమి బహిరంగ మార్కెట్ విలువ దాదాపు రూ.3,000 కోట్లు ఉంటుందని అంచనా. హైకోర్టు ఇచ్చిన స్పష్టమైన ఉత్తర్వుల మేరకు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు, సిబ్బంది.. సదరు స్థలం చుట్టూ ముళ్లకంచె (ఫెన్సింగ్) వేసి, అది ప్రభుత్వ ఆస్తి అంటూ బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతో దశాబ్ద కాలంగా సాగుతున్న భారీ భూవివాదానికి తెరపడినట్లయింది.

**ఫోర్జరీ పత్రాలతో తిమ్మిని బమ్మి చేసి..**

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం, ఖానామెట్‌లోని సర్వే నంబర్లు 41/12, 41/13, 41/14 పరిధిలో ఉన్న ఈ స్థలంపై 'ఇట్టినా ప్రాపర్టీస్' అనే ప్రైవేట్ సంస్థ కొన్నేళ్లుగా హక్కులు క్లెయిమ్ చేస్తోంది. 1963లో మాజీ సైనికుల కోటా కింద ప్రభుత్వం ఈ భూమిని కేటాయించిందని సదరు సంస్థ వాదించింది. అయితే, 2016లోనే తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఆ స్థలాన్ని ఖాళీ చేయాలంటూ సదరు సంస్థకు నోటీసులు ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ ఇట్టినా ప్రాపర్టీస్ హైకోర్టును



ఆశ్రయించింది. ఈ కేసు విచారణ సందర్భంగా రెవెన్యూ అధికారులు కోర్టుకు సమర్పించిన ఆధారాలు కబ్జాదారుల గుట్టురట్టు చేశాయి. పిటిషనర్ సమర్పించిన పట్టాదారు పత్రాలన్నీ నకిలీవని అధికారులు నిరూపించారు. రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం 1978లో ఏర్పాటవగా.. ఆ కార్యాలయం పేరుతో 1972, 1973లోనే పట్టా పత్రాలు జారీ చేసినట్లు రికార్డులు సృష్టించారని కోర్టు దృష్టికి తెచ్చారు. అంతే కాకుండా, ఆర్వోఆర్ చట్టం ప్రకారం తహసీల్దార్ సంతకం ఉండాల్సి ఉండగా.. ఉనికిలోనే లేని 'పీ. నరసింహారావు' అనే అధికారి పేరుతో, చట్టబద్ధత లేని రికార్డింగ్ ఆఫీసర్ హోదాలో ఆ ఫోర్జరీ పత్రాలు సృష్టించినట్లు తేల్చారు.

**హైకోర్టు ఆదేశాలతో హైడ్రా యాక్షన్**

కబ్జాదారులు నకిలీ పత్రాలతో ప్రభుత్వ భూమిని కాజేయాలని చూశారని నిర్ధారణకు వచ్చిన న్యాయమూర్తి జస్టిస్ నాగేష్ భీమపాక.. పిటిషన్‌ను కొట్టివేస్తూ, ప్రభుత్వ భూమిని తక్షణమే సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. హైకోర్టు తీర్పు వెలువడిన వెంటనే రంగంలోకి దిగిన రెవెన్యూ యంత్రాంగం, హైడ్రా సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నడుమ 15 ఎకరాల స్థలాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, కంచె వేసి ప్రభుత్వ ఆస్తిగా బోర్డులు పాతారు. ఇంతటి భారీ విలువైన భూమిని కబ్జా కోరల నుంచి కాపాడటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# 12 ఏళ్లలో దేశ రూపురేఖలు మార్చాం

- కాంగ్రెస్ పాపాలను కడుక్కుంటూ వచ్చాం
- 'వికసిత్ భారత్-2047' లక్ష్యంగా వేగంగా ముందుకెళ్తున్నాం
- ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, జూన్ 10:** కాంగ్రెస్ పాలనలో దేశంలోని వ్యవస్థలు దెబ్బతిన్నాయని, వేల కోట్ల రూపాయల కుంభకోణాలతో దేశాభివృద్ధి వెనక్కి వెళ్లిందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత మాటలతో కాదు, చేతలతో అభివృద్ధి చేసి చూపించామని ఆయన పేర్కొన్నారు. ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. దేశ ప్రజలు తనకు 12 ఏళ్లపాటు ప్రధానిగా పనిచేసే అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని, అందుకు 140 కోట్ల మంది భారతీయులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. 2014కు ముందు దేశ పరిస్థితి ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించిన ప్రధాని, గత పుష్కర కాలంలో దేశంలో అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని చెప్పారు. రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధితో పాటు డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టామని వివరించారు. 25 కోట్ల మంది మాత్రమే ఇంటర్నెట్ ఉపయోగించే స్థితి నుంచి నేడు 100 కోట్ల మందికి పైగా డిజిటల్ ప్రపంచంలో భాగస్వాములయ్యారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఉగ్రవాదం, అవినీతి, అస్థిరత ప్రధాన సమస్యలుగా ఉండేవని, ఎన్‌డీఏ ప్రభుత్వం వాటిని సమర్థంగా ఎదుర్కొందని మోదీ పేర్కొన్నారు. ఆర్టికల్-370 రద్దు, ట్రిపుల్ తలాక్ చట్టం, మహిళలకు రిజర్వేషన్లు, నక్సలిజంపై కఠిన చర్యలు వంటి నిర్ణయాలను ప్రస్తావించారు. దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చామని, కరోనా వంటి సంక్షోభాన్ని విజయవంతంగా ఎదుర్కొన్నామని తెలిపారు. ప్రపంచ దేశాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో భారత్ 7.7 శాతం వృద్ధి రేటుతో ముందుకు సాగడం తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు. 'వికసిత్ భారత్-2047' లక్ష్యంగా దేశం వేగంగా అడుగులు వేస్తోందని, సెమీకండక్టర్లు, క్రిటికల్ మినరల్స్, డేటా సెంటర్లు, అణుఇంధనం, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భారత్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఎన్‌డీఏలోని ప్రతి భాగస్వామ్య పక్షానికి సమాన గౌరవం, ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేసిన ప్రధాని, అధికారాన్ని సేవగా భావించి పనిచేస్తున్నామని చెప్పారు. "నేషన్ ఫస్ట్" సిద్ధాంతంతో దేశ ప్రయోజనాలే తమ ప్రభుత్వానికి ప్రధానమని, దేశ భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలు తీసుకోవడానికైనా వెనుకాడబోమని మోదీ స్పష్టం చేశారు. ప్రపంచం మొత్తం ఇప్పుడు భారత్ వైపు ఆశగా చూస్తోందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడం ప్రతి భారతీయుడి బాధ్యత అని ప్రధాని పిలుపునిచ్చారు.

# ఆపరేషన్ క్రాక్ డౌన్

**127 మంది సైబర్ నిందితుల పట్టివేత**

**సైబర్ సెక్యూరిటీ బ్యూరో వెల్లడి**

**హైదరాబాద్, జూన్ 10:** రాష్ట్రవ్యాప్తంగా సైబర్ మోసాలపై ఉక్కుపాదం మోపుతూ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో భారీ ఆపరేషన్ నిర్వహించింది. 'ఆపరేషన్ క్రాక్ డౌన్ 3.0' పేరుతో చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ఏకంగా 127 మంది సైబర్ నేరస్థులను అరెస్ట్ చేసినట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. సైబర్ నేరాల కట్టడికి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లు, జిల్లా కో-ఆర్డినేషన్ కేంద్రాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. పట్టుబడిన వారిలో 57 మంది తెలంగాణకు చెందిన వారు కాగా.. మిగిలిన వారు ఇతర రాష్ట్రాలకు చెందినవారని అధికారులు తెలిపారు. వీరిలో 68 శాతం మంది పాత నేరస్థులే కావడం గమనార్హం. 48 మంది నిందితులు నకిలీ గుర్తింపులతో ఈ మోసాలకు పాల్పడ్డారు. అరెస్ట్ అయిన వారిలో 27 మంది పెట్టుబడి మోసాలకు పాల్పడగా.. మరో 11 మంది డిజిటల్ అరెస్ట్ కుంభకోణంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. విచారణలో 103 మంది నిందితులు తాము ప్రజలను మోసం చేసినట్లు అంగీకరించారు. వీరి వద్ద నుంచి కీలక డిజిటల్ ఆధారాలతో పాటు పలు పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో ఇంకా 24 మంది పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు




చర్యలు ముమ్మరం చేశామని అధికారులు వెల్లడించారు. భవిష్యత్తులో సైబర్ నేరాల కట్టడికి మరింత కఠిన చర్యలు తీసుకుంటామని సైబర్ సెక్యూరిటీ బ్యూరో స్పష్టం చేసింది.

చురకలు



# ఉత్తర తెలంగాణకు ప్రాధాన్యం

- రూ.106 ఎత్తిపోతల పథకాలు ప్రారంభం
- కాలువల కట్టలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తి
- ధాన్యం డబ్బులు నలభై ఎనిమిది గంటల్లోనే జమ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- సిద్ధాపూర్ రిజర్వాయర్ పనుల పరిశీలన



**నిజామాబాద్, జూన్ 10:** ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టులకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులను వేగంగా పూర్తి చేయడానికి అవసరమైన నిధులను ప్రభుత్వం తప్పకుండా కేటాయిస్తుందని, ఈ రిజర్వాయర్ పూర్తయితే ప్రాంతంలో సాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని భరోసా ఇచ్చారు.మండలంలో 106 రూపాయల వ్యయంతో నిర్మించిన జాకోరా, చందూర్ ఎత్తిపోతల పథకాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ పథకాల ద్వారా దాదాపు ఎనిమిది వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరానికి నీరందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని.. భూసేకరణ, అటవీ అనుమతులు, పునరావాసం వంటి అంశాల కోసం భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ వంటి కీలక ప్రాజెక్టుల్లో పూడికతీత పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. విద్యుత్ ఖర్చులను తగ్గించడంతో పాటు పునరుత్పాదక శక్తి వినియోగాన్ని పెంచేందుకు వీలుగా కాలువల కట్టలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత పాలనలో ప్రాజెక్టులపై భారీగా ఖర్చు చేసినా ఆశించిన ఫలితాలు రాలేదని విమర్శించారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీలను పునరుద్ధరించి తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. రాష్ట్రంలో రైతుల కోసం ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా, వేగంగా నిర్వహిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి నలభై ఎనిమిది గంటల్లోపే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు వెల్లడించారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తూ, ప్రతి వ్యక్తికి నెలకు ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. సంక్షేమం, సాగునీరు, వ్యవసాయం.. ఈ మూడు రంగాల్లో సమతుల్య అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సిద్ధాపూర్ రిజర్వాయర్ పూర్తయితే నియోజకవర్గంలో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రైతులకు ఎంతో లాభం చేకూరుతుందని పేర్కొన్నారు.

# మేడిగడ్డకు మోక్షం!

- వచ్చే వేసవికల్లా పునరుద్ధరణ పూర్తి
- నవంబర్‌లో తిరిగి పనుల ప్రారంభం
- ఆ పాపం గత ప్రభుత్వానిదే
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్ (మనసులో మాట):** మేడిగడ్డ బ్యారేజీతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను అత్యంత శాస్త్రీయ పద్ధతిలో చేపట్టి 2027 వేసవి నాటికి పూర్తిచేసి తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. రైతుల ప్రయోజనాలు, ప్రాజెక్టుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మెడిగడ్డ బ్యారేజీ వద్ద జరుగుతున్న సాంకేతిక పరిశోధనలు, జలసంబంధిత (హైడ్రాలజికల్) అధ్యయనాలు, భూగర్భ (జియోటెక్నికల్) పరీక్షలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) సర్వేలు, పునరుద్ధరణ ప్రణాళికల పురోగతిని బుధవారం మంత్రి ఉత్తమ్ ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. జులై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాలు పూర్తవుతాయని, అనంతరం సేకరించిన నివేదికలను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్డీఎస్ఏ)లకు పంపుతామని తెలిపారు. ఆయా సంస్థల సూచనల మేరకు 2026 సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ ఆకృతులను (డిజైన్లను) ఖరారు చేస్తామని చెప్పారు. వర్షాకాలం ముగిసిన వెంటనే 2026 నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ తొలి వారంలో పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని, ఒకే పని సీజన్‌లో పనులు పూర్తి చేసి 2027 వేసవి నాటికి బ్యారేజీలను తిరిగి అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి స్పష్టం చేశారు. హైడ్రాలజికల్ అధ్యయనాలతో పాటు జియోటెక్నికల్ బోరు రంధ్రాల పరిశోధనలు, ఇతర సాంకేతిక పరీక్షలను వేగవంతం చేశామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం మూడు బ్యారేజీల్లో జీపీఆర్ పరీక్షలు 90 శాతం వరకు పూర్తయ్యాయని, బోరు రంధ్రాలు, జియోటెక్నికల్ పరిశోధనలు 80 శాతం వరకు పూర్తయ్యాయని చెప్పారు. జూన్ చివరి నాటికి అన్ని పరీక్షలు, పరిశోధనలు పూర్తవుతాయని వెల్లడించారు.



భవిష్యత్తులో ఈ తరహా నష్టం పునరావృతం కాకుండా ఉండేందుకు 40 నుంచి 80 మీటర్ల లోతు వరకు బోరు రంధ్రాలు తవ్వి భూగర్భ పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నామని వివరించారు. కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థల ఆమోదం వచ్చిన తర్వాతే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం రీ-డిజైన్ పేరుతో ప్రాజెక్టు అంచనాలను భారీగా పెంచిందని మంత్రి విమర్శించారు. 38,000 కోట్లతో ప్రారంభమైన ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం లక్ష కోట్ల రూపాయలు దాటిందని, కాగ్ అంచనాల ప్రకారం అది 1.45 లక్షల కోట్ల వరకు చేరే అవకాశం ఉందన్నారు. ఇంత భారీగా ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ 2023 డిసెంబర్ 7 తర్వాత మూడు బ్యారేజీలు వినియోగంలో లేకపోవడం అత్యంత దురదృష్టకరమైన పరిణామంగా ఆయన అభివర్ణించారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల తెలంగాణ ప్రజలపై, రాష్ట్ర ఖజానాపై భారీ భారం పడిందని.. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తమ ప్రభుత్వం పునరుద్ధరణ ప్రక్రియను ప్రారంభించిందని ఆయన పేర్కొన్నారు. పునరుద్ధరణ డిజైన్ల కోసం ప్రపంచ ప్రఖ్యాత కన్సల్టెంట్ సంస్థ ఏఎఫ్ఆర్వైని, ఐఐటీ బొంబాయితో కలిసి నియమించామని మంత్రి తెలిపారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నమూనా అధ్యయనాలు, సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తోందని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ నిపుణులను కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేస్తున్నామని వివరించారు. ఎన్డీఎస్ఏ గుర్తించిన స్కార్ డెప్త్, కట్-ఆఫ్ డెప్త్, టెయిల్ వాటర్ రేటింగ్ కర్వ్, ఎనర్జీ డిసిపేషన్, గేట్ల నిర్వహణ వంటి కీలక అంశాలపై సమగ్ర అధ్యయనాలు జరుగుతున్నాయని తెలిపారు. రైతుల ప్రయోజనాలతో పాటు ప్రాజెక్టుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. అన్ని బ్యారేజీలను పునరుద్ధరిస్తామని, ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# సింగరేణి సరికొత్త రికార్డు!

- పర్యావరణ పరిరక్షణలో జాతీయ స్థాయి గుర్తింపు
- దోర్లి-2 మైన్ క్లోజర్‌తో నలభై కోట్ల డిపాజిట్ వాపస్
- త్వరలోనే దోర్లి-1 నుంచి మరో అరవై కోట్లు వచ్చే అవకాశం
- బాధ్యతాయుత గనుల తవ్వకాల్లో బెంచ్‌మార్క్‌గా సింగరేణి

**బెల్లంపల్లి:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ పర్యావరణ పరిరక్షణలో మరో మైలురాయిని అధిగమించింది. బొగ్గు తవ్వకాలతో పాటు గనుల మూసివేత ప్రక్రియను పర్యావరణహితంగా పూర్తి చేయడంలో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. బెల్లంపల్లి పరిధిలోని దోర్లి-2 ఓపెన్ కాస్ట్ గనిని కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం విజయవంతంగా మూసివేసినందుకు గాను కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ నలభై కోట్ల రూపాయల ఎస్క్రో డిపాజిట్ సొమ్మును వడ్డీతో సహా సింగరేణికి తిరిగి చెల్లించింది. రాష్ట్ర ప్రభుత్వ దిశానిర్దేశంలో సింగరేణి అమలు చేస్తున్న పర్యావరణ హిత విధానాలకు ఇదో నిదర్శనంగా నిలిచింది. కొత్తగా ఏదైనా బొగ్గు గనిని ప్రారంభించే సమయంలో పర్యావరణ పరిరక్షణ, గనుల మూసివేత బాధ్యతల కోసం కేంద్ర ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం కొంత సొమ్మును డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గని మూసివేత పనులకు అయ్యే ఖర్చును అంచనా వేసి ఆ మొత్తాన్ని ఎస్క్రో ఫండ్ కింద బ్యాంకులో భద్రపరుస్తారు. కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్, మైనింగ్ సంస్థ, సంబంధిత బ్యాంకు మధ్య దీనిపై ఒప్పందం జరుగుతుంది. గని కాలపరిమితి ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం పర్యావరణ పనులన్నీ పూర్తి చేస్తే ఈ సొమ్మును వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తారు.

## దోర్లి-2 విజయవంతమైన మూసివేత..

దోర్లి-2 ఓపెన్ కాస్ట్ గనికి సంబంధించి 2013-14లో అనుమతులు వచ్చినప్పుడు సింగరేణి సంస్థ 26.79 కోట్ల రూపాయలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డిపాజిట్ చేసింది. ఏడేళ్ల పాటు విజయవంతంగా బొగ్గు ఉత్పత్తి చేసిన తర్వాత 2023-24లో ఈ గని మూతపడింది. గని



మూసివేత పనులన్నీ సక్రమంగా జరిగాయో లేదో తెలుసుకోవడానికి 2024 జులైలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఐఐఈఎస్టీ శిబ్‌పూర్ ద్వారా థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించారు. సింగరేణి అన్ని నిబంధనలను పక్కాగా అమలు చేసిందని ఆడిట్ బృందం ధ్రువీకరించడంతో డిపాజిట్ సొమ్మును విడుదల చేశారు. మొత్తం నలభై కోట్ల రూపాయల రీఫండ్ సొమ్ములో తొంభై శాతం అంటే 36.63 కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేయగా, మిగిలిన పది శాతాన్ని త్వరలోనే ఇస్తామని డిప్యూటీ అసిస్టెంట్ కోల్ కంట్రోలర్ ఆకాష్ శివ హరే తెలిపారు. గని తవ్వకాల ప్రారంభం నుంచి ముగింపు వరకు సింగరేణి పక్కా ప్రణాళికతో పర్యావరణ పనులు చేపట్టింది. తవ్వకాలు పూర్తయిన 162.517 హెక్టార్ల విస్తీర్ణంలో దట్టమైన అడవులను పెంచి పచ్చదనాన్ని పునరుద్ధరించింది. తవ్వకాలకు ముందు తీసిన 19.76 లక్షల క్యూబిక్ మీటర్ల సారవంతమైన పైమట్టిని భద్రపరిచి, ఆ తర్వాత మొక్కల పెంపకానికి ఉపయోగించింది. గాలి కాలుష్యాన్ని తగ్గించేందుకు అత్యాధునిక నీటి తుంపర్ల యంత్రాలను, భారీ నీటి ట్యాంకర్లను నిరంతరం వినియోగించింది. కాలుష్యం నియంత్రణలోనే ఉందంటూ జాతీయ పర్యావరణ సంస్థ ఈపీటీఆర్ఐ ధ్రువీకరించింది. నీటి కాలుష్యాన్ని అడ్డుకునేందుకు పది కిలోమీటర్ల మేర గార్లాండ్ డ్రైన్లు, రెండు చెక్ డ్యాంలు, ఐదు సెట్లింగ్ ట్యాంకులను నిర్మించి నీటిని శుద్ధి చేసిన తర్వాతే బయటకు వదిలారు.

## మరో అరవై కోట్లు రాబోతున్నాయి..

గని మూసివేత తర్వాత అక్కడ ఫెన్సింగ్ ఏర్పాటు, భద్రతా సిబ్బంది నియామకం, పాత నిర్మాణాల తొలగింపు వంటి పనులను సింగరేణి పక్కాగా చేపట్టింది. ఈ విజయంపై సింగరేణి ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ కే వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. గతంలో శ్రీరాంపూర్ పరిధిలోని ఆర్కే-8 భూగర్భ గని మూసివేతకు సంబంధించి కూడా నాలుగు కోట్ల రూపాయల డిపాజిట్ వెనక్కి వచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం దోర్లి-1 గనికి సంబంధించిన తనిఖీలు చివరి దశకు వచ్చాయని, దాని ద్వారా కూడా త్వరలోనే అరవై కోట్ల రూపాయలకు పైగా డిపాజిట్ సొమ్ము సింగరేణి ఖాతాలోకి రానుందని ఆయన వెల్లడించారు



# ప్రాంతీయ విద్వేషాలు దేశానికి ప్రమాదకరం

## జనసేన పుట్టిందే తెలంగాణ గడ్డపై..

## జాతీయ మీడియాతో పవన్ కల్యాణ్

**న్యూఢిల్లీ జూన్ 10:** జనసేన పార్టీ పుట్టిందే తెలంగాణ గడ్డపై అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బుధవారం న్యూఢిల్లీలో జాతీయ మీడియాతో మాట్లాడిన ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో తమ పార్టీకి లక్షన్నర మంది సభ్యులతో పాటు పటిష్టమైన నాయకత్వం, క్యాడర్ ఉందని తెలిపారు. తనను తెలంగాణలో అడుగుపెట్టొద్దనడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే అని ఆయన మండిపడ్డారు. పదమూడు నెలలుగా తనను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని.. తెలంగాణ ఏమైనా వాళ్ల జాగీరా అని ప్రశ్నించడం తప్పెలా అవుతుందని నిలదీశారు. తెలంగాణ రాష్ట్ర విభజనకు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదని.. కేవలం విభజన జరిగిన తీరును మాత్రమే తాను వ్యతిరేకించానని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ఏనాడూ ఇలా మాట్లాడలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రాంతీయ విద్వేషాలు మొదలయ్యాయని ఆయన విమర్శించారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ దేశంలో విభజన రేఖ గీయడం ఏమాత్రం సరికాదన్నారు. ప్రాంతీయ భేదాలు పెరిగితే దేశానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నవారు ఇలా ఉత్తరాది, దక్షిణాది అని మాట్లాడకూడదని హితవు పలికారు. విభజనవాదం దేశానికి మంచిది కాదని, 570కి పైగా సంస్థానాలను కష్టపడి విలీనం చేస్తేనే నేటి భారతదేశం ఏర్పడిందని గుర్తుచేశారు. తాను హైదరాబాద్ రాకూడదని కొందరు నేతలు అంటున్నారని, అలాగైతే రాహుల్ గాంధీకి దక్షిణాదితో ఎలాంటి సంబంధం లేదని చెప్పాల్సి ఉంటుందని పవన్ కల్యాణ్ ఎద్దేవా చేశారు. తాను ఎప్పుడు, ఎక్కడికి వెళ్లాలనేది ఇతర వ్యక్తులు నిర్ణయించలేరని స్పష్టం చేశారు. “ఈ దేశం నాది, నేను ఎక్కడికైనా వెళ్లగలను అనే ఉద్దేశంతోనే ‘జాగీరు‘ అనే పదం వాడాను“ అని ఆయన సమర్థించుకున్నారు. రాజకీయాల్లో మార్పు రావాలని, ప్రాంతీయ వివక్ష, విధ్వంసక ధోరణులు ఉండకూడదని యువత కోరుకుంటోందని చెప్పారు. అర్థవంతమైన, హేతుబద్ధమైన నాయకులే ఇప్పుడు సమాజానికి అవసరమన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. అక్కడ రాబోయే ఎన్నికల్లో పోటీ చేయాలని తమ పార్టీ నేతలు కోరుతున్నారని వెల్లడించారు. కాగా, ఉపాధి హామీ పథకం కింద ఏపీకి కేంద్రం 7,707.21 కోట్ల రూపాయలు కేటాయించడంపై పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యధిక నిధులు పొందిన మూడో రాష్ట్రంగా ఏపీ నిలవడం.. రాష్ట్రంలో పనుల పారదర్శకతకు నిదర్శనమన్నారు. కేంద్రం ఇస్తున్న ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు బలోపేతమవుతాయని, ప్రజల జీవనోపాధి మెరుగుపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# రోడ్ల విస్తరణకు మహర్దశ!

## జూన్ 17న సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన : మంత్రి వెంకట్ రెడ్డి

**నల్లగొండ:** రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుయిటీ మోడల్) విధానంలో చేపడుతున్న పదమూడు వేల కోట్ల రూపాయల విలువైన రోడ్డు విస్తరణ పనులకు ఈ నెల 17వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా కనగల్ ప్రాంతంలో అత్యంత భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హ్యామ్ నమూనాలోనే తెలంగాణలో ఆరు వేల మూడు వందల కిలోమీటర్ల రహదారులను నాలుగు ప్యాకేజీల్లో డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వివరించారు. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయి వర్క్ ఆర్డర్లు కూడా జారీ అయ్యాయన్నారు. దీనితో పాటు మంత్రి సీతక్క నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖ ద్వారా మరో ఏడు వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ భారీ ప్రాజెక్టుతో తెలంగాణ ముఖచిత్రం మారిపోతుందని, ప్రమాదాలు తగ్గడమే కాకుండా గ్రామీణ ప్రాంతాలకు పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయన్నారు. జూన్ 17న సాయంత్రం నాలుగు గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ఈ పనులకు శ్రీకారం చుడతారని మంత్రి తెలిపారు. నల్లగొండ జిల్లాలో రెండు ప్యాకేజీల కింద పనులు జరుగుతాయన్నారు. మొదటి ప్యాకేజీలో దర్వేష్‌పురం నుంచి గుర్రంపోడు, మల్లెపల్లి, దేవరకొండ మీదుగా దిండి వరకు మూడు వందల కోట్లతో డివైడర్‌తో కూడిన డబుల్ రోడ్డు నిర్మిస్తామన్నారు. రెండో ప్యాకేజీలో చిట్యాల నుంచి రామన్నపేట, వలిగొండ, భువనగిరి మీదుగా జగదేవ్‌పూర్ వరకు మూడు వందల కోట్లతో పనులు చేపడతామన్నారు.

# రేవంత్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదు : ధర్మపురి అర్వింద్

**భువనగిరి, జూన్ 10:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డికి ఘోర ఓటమి తప్పదని నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అర్వింద్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి చదువు రాదని ఆయన వ్యంగ్యంగా అన్నారు. బుధవారం భువనగిరిలో ఎంపీ ధర్మపురి అర్వింద్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్‌పై ఈ రాష్ట్రంలో కేసు ఉన్నట్లు ఎన్నికల సంఘానికి ఎలా తెలిసిందంటూ సందేహం వ్యక్తం చేశారు. ఇది రేవంత్ రెడ్డి కుట్రో, కాంగ్రెస్ పార్టీ కుట్రో వాళ్లే తెలుసుకోవాల్సి ఉందని బీజేపీ ఎంపీ అభిప్రాయపడ్డారు. బీజేపీ నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు ఉ ండడం సహజమన్నారు. నరేంద్రమోదీ చరిష్మాను ఓట్లుగా మార్చుకోవడంలో తెలంగాణ బీజేపీ విఫలమైందని విమర్శించారు. అక్రమ ఇసుక రవాణాకు లారీలు దొరుకుతున్నాయి.. కానీ ధాన్యం రవాణాకు దొరకడం లేదా? అంటూ ఆయన అనుమానం వ్యక్తం చేశారు. త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్టాల్లో కంటే తెలంగాణలో బీజేపీ విజయం సాధించడం సులభమన్నారు. తెలంగాణ ప్రభుత్వం గత రెండేళ్లుగా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి 32 లక్షల టన్నుల బియ్యం బకాయిగా ఉందని చెప్పారు. నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రతిపక్షం లేదన్నారు. కానీ నేడు చాలా ప్రతిపక్షాలు ఉన్న సమయంలో 12 ఏళ్ల పాటు మోదీ ప్రధానిగా ఉన్నారని ఎంపీ అర్వింద్ వివరించారు.



# ఎన్నేళ్లు పాలించామన్నది కాదు.. ఏం సాధించామన్నదే గీటురాయి!

దేశ రాజకీయ చరిత్రలో జూన్ 10, 2026 ఒక గణాంకపరమైన మైలురాయిగా నమోదు కావచ్చు. తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును దాటేస్తూ.. అత్యధిక కాలం ప్రజలచే ఎన్నికైన ప్రధానిగా నరేంద్ర మోడీ రికార్డు సృష్టించారు. 4,399 రోజులు పూర్తి చేసుకుని సరికొత్త అంకెను నమోదు చేశారు. అయితే చరిత్ర ఎప్పుడూ పాలకుల క్యాలెండర్లను చూసి తీర్పు చెప్పదు. ఎన్నేళ్లు అధికారంలో ఉన్నామన్నది కాదు.. ఆ కాలంలో దేశానికి ఏం చేశాం, ప్రజల బతుకుల్లో ఎలాంటి మార్పులు తెచ్చామన్నదే అసలైనా టురాయి. ఒకవైపు శూన్యం నుంచి దేశాన్ని నిర్మించిన నెహ్రూ దార్శనికత.. మరోవైపు దశాబ్దాల పాటు నిర్మించుకున్న ప్రభుత్వ ఆస్తులను కరిగించేస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకున్న మోడీ ప్రజా వ్యతిరేక విధానాలు.. ఈ రెండింటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పునాదులు లేని దేశానికి ప్రాణం పోసిన నెహ్రూ

బ్రిటిష్ వారి వందల ఏళ్ల దోపిడీలో సర్వస్వం కోల్పోయి, తీవ్రమైన పేదరికం, నిరక్షరాస్యత, ఆకలి చావులతో అల్లాడుతున్న దేశాన్ని నెహ్రూ తన చేతుల్లోకి తీసుకున్నారు. ఆయన ముందున్న సవాళ్లు సామాన్యమైనవి కావు. విభజన గాయాలతో రగులుతున్న దేశాన్ని ఏకతాటిపైకి తేవడంతో పాటు ఆధునిక భారతానికి పునాదులు వేయాల్సిన గురుతర బాధ్యత ఆయన భుజాలపై పడింది. ఈ దేశానికి భారీ ఆనకట్టలే ఆధునిక దేవాలయాలని ఆయన బలంగా నమ్మారు. వ్యవసాయాన్ని బలోపేతం చేసేందుకు భాక్రా నంగల్, నాగార్జున సాగర్ లాంటి భారీ సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.నేడు మనం గర్వంగా చెప్పుకుంటున్న అత్యున్నత విద్యా సంస్థలు, పరిశోధనా కేంద్రాలన్నీ నెహ్రూ ముందుచూపుతో ప్రాణం పోసుకున్నవే. ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్ లాంటి విద్యా సంస్థలను స్థాపించి దేశ యువతకు ప్రపంచ స్థాయి విద్యను అందించారు. ఇస్రో, డీఆర్డీఓ, అణు ఇంధన సంస్థల ఏర్పాటు ద్వారా అంతరిక్షం నుంచి రక్షణ రంగం వరకు స్వదేశీ పరిజ్ఞానానికి ఆనాడే బీజం వేశారు. ఉక్కు కర్మాగారాలు, భారీ పరిశ్రమలను ప్రభుత్వ రంగంలో స్థాపించి లక్షలాది మందికి ఉపాధి కల్పించారు. సంస్థానాల విలీనంలో సర్దార్ పటేల్‌కు పూర్తి స్వేచ్ఛను ఇచ్చి దేశ పటాన్ని సుస్థిరం చేశారు. రాజ్యాంగ వ్యవస్థలను బలోపేతం చేస్తూ, అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజాస్వామ్య విలువలకు పెద్దపీట వేశారు. అంతర్జాతీయ స్థాయిలో అలీన విధానాన్ని ప్రవేశపెట్టి ప్రపంచ దేశాల మన్ననలు పొందారు. ఇవన్నీ కేవలం రికార్డుల కోసం చేసినవి కావు.. భవిష్యత్ తరాల బాగు కోసం వేసిన బలమైన పునాదులు.

## వైఫల్యాల నీడలో మోడీ పాలన

ప్రస్తుత ప్రధాని మోడీ విషయానికి వస్తే పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తుంది. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామ మందిర నిర్మాణం లాంటివి భావోద్వేగాల పరంగా, రాజకీయంగా లబ్ధి చేకూర్చి ఉండవచ్చు. కానీ సామాన్యుడి బతుకును మార్చే ఆర్థిక పురోగతిలో మాత్రం ఈ పన్నెండేళ్ల పాలన దారుణంగా విఫలమైందనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. పెద్ద నోట్ల రద్దు అనే అనాలోచిత నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థను కోలుకోలేని దెబ్బతీసింది. లక్షలాది లఘు, చిన్న పరిశ్రమలు మూతపడ్డాయి. ఆ తర్వాత ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా హడావుడిగా అమలు చేసిన జీఎస్టీ విధానం చిరు వ్యాపారుల నడ్డి విరిచింది.పదేళ్ల కిందట ఉన్న నిత్యావసరాల ధరలతో పోలిస్తే నేడు పరిస్థితులు ఆకాశాన్నంటుతున్నాయి. గ్యాస్ సిలిండర్ ధర, పెట్రోల్, డీజిల్ రేట్లు సామాన్య మధ్యతరగతి ప్రజలకు గుదిబండగా మారాయి. రికార్డు స్థాయిలో పెరిగిన ద్రవ్యోల్బణం సామాన్యుల పొదుపును హరించివేసింది. నెహ్రూ కాలంలో ఎంతో కష్టపడి నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను, లాభాల్లో ఉన్న జాతీయ ఆస్తులను ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా కట్టబెడుతున్నారన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. దేశ సంపద అంతా కొద్దిమంది బడా బాబుల చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్న తీరు ఆర్థిక అసమానతలకు దారితీస్తోంది.

## ఉద్యోగాల్లేక యువత ఆగమాగం.. ప్రజాస్వామ్య వ్యవస్థల నిర్వీర్యం..

ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ నీటిమూటగానే మిగిలిపోయింది. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగ రేటు పెరిగిపోవడం యువతలో తీవ్ర నైరాశ్యాన్ని నింపుతోంది. సైన్యంలో సైతం అగ్నిపథ్ లాంటి కాంట్రాక్ట్ విధానాలను తీసుకురావడం యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేయడమే. అధికారాన్ని నిలబెట్టుకునే క్రమంలో రాజ్యాంగ బద్ధ సంస్థలను సైతం ప్రతిపక్షాలను అణచివేసే ఆయుధాలుగా వాడుకుంటు న్నారన్న అపఖ్యాతి ఈ పదేళ్ల పాలనలో స్పష్టంగా కనిపించింది. సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖలను ప్రయోగించి ప్రాంతీయ పార్టీలను భయాందోళనలకు గురిచేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. ఇక అన్నదాతల విషయానికి వస్తే.. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేలా తెచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు వీధుల్లోకి వచ్చి ఏడాది పాటు ప్రాణాలకు తెగించి పోరాడాల్సి వచ్చింది. ఆ ఉద్యమంలో ఏడు వందల మందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోవడం ఈ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. రికార్డులు సాధించడం అంటే క్యాలెండర్ పేజీలను తిప్పడం కాదు. పాలకుడు దిగిపోయిన దశాబ్దాల తర్వాత కూడా దేశ ప్రజలు ఆ ఫలాలను అనుభవించగలగాలి. నెహ్రూ నిర్మించిన ఆనకట్టల నీరు నేటికీ పొలాలను సస్యశ్యామలం చేస్తోంది. ఆయన స్థాపించిన విద్యాసంస్థల నుంచి వచ్చిన ఎంతో మంది నేడు ప్రపంచ కుబేరుల జాబితాలో ఉన్నారు. కేవలం ప్రచార ఆర్భాటాలు, భావోద్వేగాలను రెచ్చగొట్టే రాజకీయాలతో రికార్డులు బద్దలు కొట్టవచ్చు కానీ.. చరిత్ర పుటల్లో శాశ్వతమైన, గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించుకోవడం మాత్రం అసాధ్యం. ఎన్ని రోజులు అధికారంలో ఉన్నామన్న అంకెల కంటే.. ఎంతమంది కన్నీళ్లు తుడిచామన్నదే నిజమైన నాయకుడికి అసలైనా టురాయి

# నెహ్రూ రికార్డును అధిగమించిన మోడీ





**న్యూఢిల్లీ, జూన్ 10 :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారత రాజకీయ చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించారు. బుధవారంతో ప్రధానిగా వరుసగా 4,399 రోజులు పూర్తి చేసుకుని, దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానమంత్రి రికార్డును అధిగమించారు. నరేంద్ర మోడీ 2014 మే 26న తొలిసారిగా ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా విజయం సాధించి మూడోసారి ప్రధానిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో బుధవారం నాటికి ఆయన పదవీకాలం 4,399 రోజులకు చేరుకుంది. ఇప్పటివరకు ఈ రికార్డు దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉండేది. 1952 మే 13న ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నెహ్రూ 1964 మే 27న మరణించే వరకు వరుసగా 4,398 రోజులపాటు పదవిలో కొనసాగారు. దీంతో ఎన్నికైన ప్రధానిగా అత్యధిక కాలం సేవలందించిన నాయకుడిగా మోడీ కొత్త రికార్డు నెలకొల్పారు. ఎన్నికైన తర్వాత వం-సగా అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన నాయకుల జాబితాలో నెహ్రూ తర్వాత ఇందిరా గాంధీ మూడో స్థానంలో ఉన్నారు. ఆమె 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు వరుసగా 4,077 రోజులపాటు ప్రధానిగా పనిచేశారు.

### మోడీకి రాష్ట్రపతి అభినందనలు

ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని మోడీకి అభినందనలు తెలిపారు. మోడీ నాయకత్వంపై దేశ ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఈ మైలురాయి నిదర్శనమని పేర్కొన్నారు. ఆయన పాలనలో దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని కొనియాడారు.

### విదేశీ నేతల శుభాకాంక్షలు

మోడీ సాధించిన ఈ ఘనతపై పలు దేశాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, అమెరికా ప్రతినిధులు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలియజేశారు. భారత అభివృద్ధి, అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ఠ పెంపులో మోడీ నాయకత్వం కీలక పాత్ర పోషించిందని వారు పేర్కొన్నారు.

### చంద్రబాబు, లోకేశ్ ప్రశంసలు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ప్రధాని మోడీకి అభినందనలు తెలిపారు. దేశ అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక సంస్కరణల ద్వారా భారత దేశాన్ని కొత్త దిశగా నడిపించారని కొనియాడారు. కేంద్ర మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ, నెహ్రూ రికార్డును అధిగమించడం అనితరసాధ్యమైన ఘనత అని పేర్కొన్నారు.

### బండి సంజయ్ స్పందన

కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ భారత రాజకీయ చరిత్రలో మోడీ కొత్త అధ్యాయాన్ని లిఖించారన్నారు. నెహ్రూ రికార్డును అధిగమించడం ద్వారా దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన నాయకుడిగా మోడీ నిలిచారని పేర్కొన్నారు. భారత దేశాన్ని ప్రపంచ వేదికపై మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే నాయకత్వం మోడీదేనని ఆయన అభిప్రా యపడ్డారు.

### సుపరిపాలన అతిపెద్ద పరీక్ష

#### ఎక్స్ వేదికగా మోడీ పోస్ట్

**న్యూఢిల్లీ, జూన్ 10:** ప్రధాని నరేంద్ర మోదీ చరిత్ర సృష్టించారు. భారత్‌లో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన నేతగా ఆయన నిలిచారు. ఈసందర్భంగా తన 12 ఏళ్ల పాలనపై మోదీ ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టారు. 'ప్రజా సేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష. వినయం, అంకితభావం, కర్తవ్య దీక్షతో అవిశ్రాంతంగా పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందగలడు' అని మోదీ రాసు కొచ్చారు. ఇక, ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అనేకమంది ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్ వేదికగా పోస్టులు పెడుతున్నారు.

# పాకిస్థాన్‌లో విషాదం

## పీవోకేలో కూలిన పాక్ హెలికాప్టర్

## 21 మంది సైనికులు మృతి

**ఢిల్లీ:** దాయాది దేశం పాకిస్థాన్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. పాకిస్థాన్ ఆర్మీ ఏవియేషన్‌కు చెందిన ఎంఐ-17 హెలికాప్టర్ ముజఫరాబాద్ సమీపంలో టేకాఫ్ అవుతున్న సమయంలో కూలిపోయింది. సాంకేతిక లోపం కారణంగా కూలిపోయింది. హెలికాప్టర్‌లో ఉన్న సిబ్బంది అందరూ అమరులయ్యారని పాకిస్థాన్ మీడియా తెలిపింది. ఈ ఘటనలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్‌ను ఉటంకిస్తూ పాకిస్థాన్ డాన్ పత్రిక వెల్లడించింది. హెలికాప్టర్‌లో 21 మంది సైనికులు ఉన్నట్లుగా తెలుస్తోంది. అందరూ చనిపోయినట్లుగా సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని అధికారులు వెల్లడించారు. హెలికాప్టర్‌లో ఉన్న సైనిక సిబ్బంది దేశ సేవలో అమరులయ్యారని పాకిస్థాన్ సైన్యం పేర్కొంది. ఈ ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు పాకిస్థాన్ ఆర్మీ దర్యాప్తు ప్రారంభించింది. సాంకేతిక లోపమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ.. పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ముజఫరాబాద్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటన పాకిస్థాన్ సైనిక వర్గాల్లో విషాదాన్ని నింపింది.

### ఎంఐ-17 హెలికాప్టర్ ప్రత్యేక ఇదే

*MI*-17 అనేది *MI*-8 నుంచి నవీకరించబడింది. కొత్త వెర్షన్ మిల్ మాస్కో హెలికాప్టర్ ప్లాంట్ ద్వారా నిర్మించారు. రష్యాలో తయారైన అత్యధిక బరువు మోసే రవాణా హెలికాప్టర్ ఇది. ఈ హెలికాప్టర్‌లో 30 మంది సైనికులు, 12 స్ట్రెచర్‌లు, సుమారు 4 వేల సరుకు మోయగలదు. మూడు టన్నుల వరకు బరువు మోయగలదు. రెండు క్లిమోవ్ ఎఎ3-117 ఇంజిన్‌ల ద్వారా శక్తి పొందుతుంది. గంటలకు 250 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతుంది.



# ఎన్డీఏ భేటీలో ప్రధాని మోడీకి అభినందనలు

## వివిధ రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీలు హాజరు

**న్యూఢిల్లీ, జూన్ 10:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఎన్డీయే నేతల పెద్దఎత్తున అభినందలు తెలిపారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకోవడం, సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన రికార్డును మోదీ సొంత చేసుకున్న నేపథ్యంలో ఎన్డీయే నేతల సమావేశం బుధవారంనాడిక్కడ భారత్ మండపంలో జరిగింది. ప్రధాన మంత్రి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో 22 ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు, ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షాల నేతలు, బీజేపీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 1964 మే 27న తుదిశ్వాస విడిచేంత వరకూ 4,398 రోజులపాటు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగారు. ఆ రికార్డును మోదీ అధిగమించారు. 2014 మే 26న ప్రధాని పగ్గాలు చేపట్టిన ఆయన బుధవారంతో ఆ పదవిలో నిరాటంకంగా 4,399 రోజులు పూర్తిచేసుకున్నారు. తద్వారా దీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన అరుదైన రికార్డును సొంతం చేసుకునున్నారు.

# గ్రెనేడ్ పేలుడు విషాదం

- ఉరిలో దుర్ఘటన ఘటన
- ఇద్దరు జవాన్ల మృతి
- విచారణకు ఆదేశాలు జారీ



**జమ్మూ, జూన్ 10 :** దేశ సరిహద్దుల భద్రత కోసం విధులు నిర్వహిస్తున్న భారత సైన్యంలో విషాదం చోటుచేసుకుంది. జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా ఉరి సెక్టార్‌లో ఉన్న కమాల్‌కోట్ సైనిక శిబిరంలో ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలడంతో ఇద్దరు భారత జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన సైన్యాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేయగా, మృతుల కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. అధికారిక సమాచారం ప్రకారం సైనిక శిబిరంలో సాధారణ విధుల్లో భాగంగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను ఒక సిబ్బంది నుంచి మరొక సిబ్బందికి అప్పగించే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సమయంలో అనుకోకుండా ఒక గ్రెనేడ్ పేలింది. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో సమీపంలో ఉన్న ఇద్దరు జవాన్లు తీవ్ర గాయాల పాలయ్యారు. శిబిరంలో ఒక్కసారిగా కలకలం రేగగా, ఇతర సైనికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన జవాన్లను అత్యవసర చికిత్స కోసం సైన్యానికి చెందిన 92 బేస్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే వారి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు ప్రాణాలు కాపాడలేకపోయారు. చికిత్స పొందుతూ ఇద్దరు జవాన్లు మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాలు ధ్రువీకరించాయి. దీంతో సైనిక శిబిరంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై స్పందించిన రక్షణ శాఖ వర్గాలు ఇది పూర్తిగా ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన అని స్పష్టం చేశాయి. ఇందులో ఉగ్రవాదుల ప్రమేయం గానీ, శత్రు దేశాల చర్యలు గానీ, ఇతర బాహ్య శక్తుల పాత్ర గానీ లేదని వెల్లడించాయి. విధి నిర్వహణ సమయంలో చోటుచేసుకున్న ప్రమాదం కారణంగానే ఈ విషాదం సంభవించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయినట్లు తెలిపాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకునేందుకు సైన్యం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేసింది. గ్రెనేడ్ ఎలా పేలింది, భద్రతా నిబంధనల అమలులో ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను విచారణలో పరిశీలించనున్నారు. సాధారణంగా ఇలాంటి ఘటనలు చాలా అరుదుగా జరుగుతాయని, ఆయుధాలు, పేలుడు పదార్థాల నిర్వహణలో అత్యంత అప్రమత్తత అవసరమని అధికారులు పేర్కొన్నారు. మృతి చెందిన జవాన్ల కుటుంబాలకు భారత సైన్యం, రక్షణ శాఖ అధికారులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం అందాల్సిన ఆర్థిక సాయం, ఉద్యోగ సంబంధిత ప్రయోజనాలు, ఇతర సంక్షేమ పథకాలన్నింటినీ వేగంగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేశ సేవలో ఉన్న ఇద్దరు సైనికుల మృతి పట్ల దేశవ్యాప్తంగా సంతాపం వ్యక్తమవుతోంది.

# లీకేజీలతో వృథా అవుతున్న మిషన్ భగీరథ నీరు

**కల్లూరు ప్రజల ఆవేదన**

**వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్**



**సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మున్సిపాలిటీ పరిధి ఎన్ఎస్పీ ప్రాంతంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీల కారణంగా తాగునీరు భారీగా వృథా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పైపులైన్ నుంచి గత 20 రోజులుగా నీరు నిరంతరం లీక్ అవుతూ కాలువలా ప్రవహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రజలకు సరఫరా చేయాల్సిన తాగునీరు రోడ్డుపైకి వచ్చి వృథా అవుతుండగా, మరోవైపు పట్టణంలో నీటి కొరత కొనసాగుతుండటం బాధాకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం కల్లూరులో రెండు రోజులకు ఒకసారి మాత్రమే మిషన్ భగీరథ నీటి సరఫరా జరుగుతోందని, లీకేజీల కారణంగా మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, నీటి వృథాను అరికట్టి ప్రజలకు ప్రతిరోజూ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా యంత్రాంగం ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి కల్లూరు ప్రజలకు నిరంతరాయంగా తాగునీటి సరఫరా అందించాలని కోరుతున్నారు.

# ప్రజాపాలనతో ప్రజలకు చేరువవుతున్న ప్రభుత్వం

**జిల్లా కలెక్టర్ హరిత**

**లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ**



**కాగజ్నగర్:** ప్రజాపాలనతో ప్రభుత్వం ప్రజలకు చేరువ అవుతుందని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. కాగజ్నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డు నౌగాంబస్తీలో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో పరిశుభ్రత కీలకమని పేర్కొన్నారు. అలాగే ప్రతి కుటుంబం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డబుల్ బెడ్రూం ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ షాహిన్ సుల్తానా, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, వివిధ శాఖల అధికారులు, 27వ వార్డు కౌన్సిలర్ సిద్ధం రాజేశ్వరి శ్రీనివాస్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ తగ్గింపు

**రైతులకు ఊరట**

**సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూర్ మండలంలోని అమ్మపాలెం రెవెన్యూ పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ సమస్యకు పరిష్కారం లభించింది. స్టాంప్ డ్యూటీని తగ్గించడంతో రైతులకు భారీ ఊరట కలిగిందని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పుచ్చకాయల కాంతారెడ్డి, అమ్మపాలెం గ్రామ సర్పంచ్ పెద్దగౌండ్ల ప్రసన్న ధర్మారావు తెలిపారు. అమ్మపాలెం గ్రామానికి చెందిన సుమారు 50 మంది రైతుల 80 ఎకరాల భూములకు గతంలో పొరపాటున రూ.35లక్షల మేర రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ నమోదైంది. దీంతో భూముల క్రయవిక్రయాల సమయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, ఎకరానికి సుమారు రూ.4లక్షల వరకు స్టాంప్ డ్యూటీ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను రైతులు, స్థానిక నాయకులు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన వారు ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. వారి కృషి ఫలితంగా స్టాంప్ డ్యూటీ తగ్గించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులకు న్యాయం జరిగేలా కృషి చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్లకు రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం అవసరం





- **మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్**

**ఆసిఫాబాద్ టౌన్ :** పట్టణాన్ని పరిశుభ్రంగా, పచ్చగా మార్చడమే మన అందరి లక్ష్యం కావాలని మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ అన్నారు. బుధవారం పట్టణంలోని జనకాపూర్ లోని రైతు వేదికలో మున్సిపల్ ఆధ్వర్యంలో 1, 13, 14, 15 వార్డుల ప్రత్యేక సభలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ కేవలం మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ఇందులో ప్రతి ఒక్క పౌరుడి భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇండ్లలో ఉత్పత్తయ్యే తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకే అందించాలి తప్ప రోడ్లపై, డ్రైనేజీలలో వేయవద్దని కోరారు. వార్డు సభల ద్వారా ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులను, సమస్యలను ఎప్పటికప్పుడు రికార్డు చేస్తున్నామని తెలిపారు. వర్షాకాలం ముంచుకొస్తున్న తరుణంలో దోమల నివారణకు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు వార్డులలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్లు నిర్వహిస్తామన్నారు. త్వరలోనే అన్ని వార్డులలో మౌలిక వసతుల కల్పన పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. వార్డుల వారీగా ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం వారు రైతు వేదిక ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, కౌన్సిలర్ వినోద్, విద్యుత్ శాఖ ఏఈ కే లక్ష్మీ రాజం, మున్సిపల్ ఏఈ నవీన్, మున్సిపల్ సిబ్బంది పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసరాలు, ఇంధన ధరలను తక్షణమే తగ్గించాలి

**సీపీఐ డిమాండ్**



**అసిఫాబాద్ టౌన్:** దేశంలో అడ్డూఅదుపూ లేకుండా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా సమితి డిమాండ్ చేసింది. బుధవారం సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో జిల్లా రెవెన్యూ డీఆర్ఓ దాసరి వేణుకు పార్టీ నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సాయికుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలనలో సామాన్య, మధ్యతరగతి ప్రజల బతుకులు భారంగా మారాయని మండిపడ్డారు. 'అచ్చే దిన్' వస్తాయని నమ్మబలికి, నేడు కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీలు ఇస్తూ, సామాన్యులపై మాత్రం పన్నుల భారం వేస్తున్నారని విమర్శించారు. 2014తో పోలిస్తే పెట్రోల్ ధర రూ.72 నుండి రూ.111 కి, డీజిల్ రూ.55 నుండి రూ.103 కి, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.410 నుండి ఏకంగా రూ.1240 కి చేరిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రూ.90 లోపు ఉన్న సన్ఫ్లవర్ ఆయిల్ రూ.160 కి, రూ.75 ఉన్న కందిపప్పు రూ.165 కి పెరిగి కుటుంబ బడ్జెట్లను అతలాకుతలం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లో నల్లబజారును, కృత్రిమ కొరతను సృష్టిస్తున్న అక్రమ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పేదలకు సబ్సిడీపై రేషన్ వస్తువులను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ తిరుపతి, మారం శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు కాంద్ర అజయ్ కుమార్, మిస చంద్రశేఖర్, కందుల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు**



**తాండూర్:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. బుధవారం తాండూర్ మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం, సాదా బైనామా దరఖాస్తులు, భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న మూడో విడత ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 25 నుంచి ప్రారంభమయ్యే ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించేలా చర్యలు తీసుకోవాలని, సూపర్వైజర్లు, ఏఈఆర్వోలు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజల భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూభారతి పోర్టల్ను అందుబాటులోకి తీసుకువచ్చిందని, పెండింగ్లో ఉన్న దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. సాదా బైనామా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించాలన్నారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, కార్యాలయానికి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, సర్టిఫికెట్లను నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులో జారీ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యు.జ్యోత్స్న, డిప్యూటీ తహశీల్దార్ జె.కల్పన, ఆర్ఐలు బి.పద్మజా, టి.మురళీధర్ రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజాపాలనతోనే సామాన్యుడికి న్యాయం

- **రెండున్నరేళ్లలో ప్రజా సంక్షేమం గడపగడపకూ చేరింది**
- **యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీకర్ గౌడ్**



**ఆదిలాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల కాలంలోనే సామాన్య, పేద ప్రజలకు నిజమైన ఆర్థిక భరోసా లభించిందని ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా అధ్యక్షుడు, కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్ అన్నారు. గత పాలకుల మాదిరిగా కేవలం హామీలకే పరిమితం కాకుండా, ప్రతి కుటుంబానికి నేరుగా లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా ప్రతి మహిళకు డబ్బులు ఆదా అవుతోందన్నారు. అలాగే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ పేద కుటుంబాలపై అదనపు భారం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచడం ద్వారా జిల్లాలోని గిరిజనులు, ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వర్గాల పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన చికిత్సలు కూడా ఉచితంగా పొందే అవకాశం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేపర్ లీకేజీలతో యువత తీవ్ర నిరాశకు గురయ్యారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 70వేల ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను యువతకు అందించిందని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.2లక్షల వరకు పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేయడం ద్వారా రైతన్నలకు ఆర్థిక ఊరటనిచ్చిందన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీలు అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజల జేబుల్లో డబ్బులు మిగిలేలా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి జిల్లా ప్రజలు ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# స్వచ్ఛ గ్రామం లక్ష్యంగా పరిశుభ్రతా పనులు

- **సర్పంచ్, ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమం**



**జైనూర్:** జైనూర్ మండలం జంగం గ్రామపంచాయతీ పరిధిలో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంతో సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని చెత్తాచెదారం, ఎండిపోయిన పొదలు, వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రపర్చే పనులు చేపట్టారు. గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజల సహకారంతో ప్రధాన వీధులు, బహిరంగ ప్రదేశాల్లో శుభ్రత పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు పరిశుభ్రత పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ప్రతిఒక్కరూ తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. పరిశుభ్రమైన వాతావరణంతో వ్యాధులు దూరమై ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని తెలిపారు. ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో పరిశుభ్రతకు కీలకపాత్ర ఉందని పేర్కొన్నారు. స్వచ్ఛ గ్రామ నిర్మాణానికి ప్రజలందరూ సహకరించాలని, భవిష్యత్తులో కూడా ఇలాంటి పరిశుభ్రతా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని అన్నారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని పిలుపునిచ్చారు.

చురకలు

గురువారం11 జూన్ 2026

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**జిల్లా ఎస్పీ నితికా పంత్**

**ఆసిఫాబాద్ :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ పిలుపునిచ్చారు. రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా, అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక – 99 కార్యచరణ ప్రణాళిక' గ్రామ సభల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన సదస్సుకు జిల్లా ఎస్పీ నితికా పంత్ ముఖ్య అతిథిగా హాజరై వైద్య విద్యార్థులకు రోడ్డు భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మితిమీరిన వేగాన్ని తగ్గించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరి చేత రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని, బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతామని ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ రోజు ఒక్కరోజే జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని 68 గ్రామసభలలో ఈ "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని



పోలీసులు విజయవంతంగా నిర్వహించి, ప్రజలకు యువతకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రియదర్శిని, ఆసిఫాబాద్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, మెడికల్ కాలేజ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జర్మన్ భాషా శిక్షణతో విదేశీ ఉపాధి అవకాశాలు

- **యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి**
- **రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద**



**మంచిర్యాల:** జర్మన్ భాషా శిక్షణ ద్వారా విదేశాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవచ్చని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు-భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం టాస్క్ ఆధ్వర్యంలో మందమర్రి పట్టణంలోని ఇల్లందు క్లబ్లో ఏర్పాటు చేసిన జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా జర్మనీలో నైపుణ్యం కలిగిన యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నర్సింగ్, సాంకేతిక, పారిశ్రామిక రంగాల్లో లక్షలాది ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని, తెలంగాణ యువత ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం టాస్క్ ద్వారా జర్మన్ భాషా శిక్షణ అందిస్తోందన్నారు. యువత స్థానికతకు పరిమితం కాకుండా ప్రపంచ స్థాయి అవకాశాల కోసం ముందుకు సాగాలని సూచించారు. జర్మనీలో వారానికి 32 నుంచి 35 గంటల పని సమయం మాత్రమే ఉండడంతో పాటు నెలకు రూ.2.5 లక్షలకుపైగా ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రైవేట్ ఏజెన్సీల మోసాలకు గురికాకుండా ప్రభుత్వ సంస్థల ద్వారా శిక్షణ పొంది విదేశీ ఉద్యోగాలు పొందాలని సూచించారు. ఇప్పటికే ఈ కార్యక్రమానికి 112 మంది యువత నమోదు చేసుకున్నారని, వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. టామ్కామ్ సంస్థకు రూ.90 కోట్ల నిధులు అందించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు నెలకు రూ.2వేల స్టైఫండ్ అందిస్తుండగా, జర్మన్ భాషా శిక్షణలో 80శాతం హాజరు సాధించిన అభ్యర్థులకు కాకా వెంకటస్వామి ట్రస్ట్ తరపున అదనంగా రూ.వెయ్యి స్టైఫండ్ అందజేస్తామని అన్నారు. యువతలో క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధన ఉండాలని, జర్మన్ భాషను ప్రతిరోజూ సాధన చేస్తే విదేశీ ఉద్యోగాల సాధన సులభమవుతుందని పేర్కొన్నారు. మందమర్రిలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రతి వారం శిక్షణ కేంద్రాన్ని సందర్శిస్తానని తెలిపారు. అంతకుముందు క్లబ్ ఆవరణలో మొక్కలు నాటి, జర్మన్ భాషా శిక్షణలో బీటూ సర్టిఫికేషన్ పూర్తి చేసిన మరియన్ పాసల్, హుబా ఫాతిమాలకు ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, తహశీల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు, టాస్క్ జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, టామ్కామ్ మేనేజర్ నాగభారతి, అధికారులు, శిక్షకులు, యువత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

**నేరడిగొండ:** పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని డిప్యూటీ ఎఫ్ఆర్ఓ సవిత అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండలంలోని లఖంపూర్ గ్రామంలో బుధవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో మొక్కల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. భావి తరాలకు స్వచ్ఛమైన వాతావరణం, స్వచ్ఛమైన గాలిని అందించాలంటే ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అందరి బాధ్యత అని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సెడ్మకి సుజాత గంగాధర్, ఎఫ్బీఓ రాజేందర్, గ్రామ పటేల్, వార్డు సభ్యులు, అటవీ శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యత నిర్వర్తించాలని ప్రతిజ్ఞ చేశారు.



# ఇంటి గోడ కూలి బాలిక మృతి

- **అచలాపూర్లో విషాదం**
- **ఆడుకుంటున్న సమయంలో ప్రమాదం**

: మండలంలోని అచలాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో బుధవారం విషాద ఘటన చోటుచేసుకుంది. పాత ఇంటి గోడ కూలిపోవడంతో ఎమ్మర్ల సునైత్రి (07) అనే బాలిక మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. పిల్లలు ఇంటి సమీపంలో ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా పాత ఇంటి గోడ కూలిపోయింది. గోడతో పాటు దూలం బాలికపై పడటంతో ఆమె తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనలో మరో కొందరు పిల్లలకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. మృతురాలు తాండూర్ మండల కేంద్రంలోని వాణిని కేతన్ పాఠశాలలో చదువుతున్నట్లు ఆమె తండ్రి శేఖర్ తెలిపారు. బాలిక మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న తాండూర్ ఏఎస్సై రాజమౌళి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



# జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేయండి



- **బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కె.సందీప్**

**నేరడిగొండ (బోథ్):** ఈనెల 20వ తేదీన బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కె.సందీప్ పిలుపునిచ్చారు. జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ నేపథ్యంలో బుధవారం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదా కావడంతో పాటు ఇరువర్గాల మధ్య సత్సంబంధాలు కొనసాగుతాయని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా న్యాయవాదులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, అత్యధిక సంఖ్యలో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన, సులభంగా న్యాయం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏజీపీ పంద్రం శంకర్, బార్ అసోసియేషన్ కార్యదర్శి రూపేందర్ సింగ్, న్యాయవాదులు ఆడెపు హరీష్, మహేష్, గంగసాగర్, సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన జీఎంను కలిసిన ప్రజాప్రతినిధులు



**తాండూర్:** బెల్లంపల్లి సింగరేణి ఏరియా నూతన జనరల్ మేనేజర్ (జీఎం)గా బాధ్యతలు స్వీకరించిన రమేష్ను తాండూర్ మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు బుధవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన జీఎంకు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు పరిసర గ్రామాల అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎస్.రవీందర్ రెడ్డి, మాదారం సర్పంచ్ కుష్నపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, నీలాయపల్లి గ్రామ సర్పంచ్ పోవేణి తిరుపతి, నర్సాపూర్ గ్రామ సర్పంచ్ పరపత్ రావు, ఉప సర్పంచ్ ప్రభాత్ రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన బోర్వెల్కు భూమిపూజ



**తాండూర్:** మండలంలోని నర్సాపూర్ గ్రామంలో తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేయనున్న నూతన బోర్వెల్ పనులకు బుధవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పరపత్ రావు, మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు సురం రవీందర్ రెడ్డి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పరపత్ రావు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని డీఎంఎఫ్టీ నిధుల ద్వారా బోర్వెల్ మంజూరైందన్నారు. ఇందుకు డీసీసీ ఉపాధ్యక్షులు సురం రవీందర్ రెడ్డి కృషి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సహకారం కారణమని తెలిపారు. గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదారం, నీలయపల్లి గ్రామాల సర్పంచులు కుష్నపల్లి లక్ష్మణ్, పోలవేని తిరుపతి, ఉప సర్పంచులు ప్రభాత్రావు, సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు తొడసం బాదు, జేనేని రజిత, ఆత్రం గౌరబాయి, గ్రామస్తులు మడవి మాణిక్రావు, భగవత్రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలి

- **కొమురంభీం చౌక్లో నూతన సిగ్నల్ను ప్రారంభించిన రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్**



**ఆదిలాబాద్:** వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర డీజీపీ సివి ఆనంద్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంతో పాటు రోడ్డు భద్రతను మెరుగుర్చాలనే లక్ష్యంతో కొమురంభీం చౌక్లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఆధునిక ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థలు ప్రమాదాలను తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజల సహకారంతోనే ప్రమాద రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన సి.వి. ఆనంద్కు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి డీజీపీని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. పట్టణంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన కొమురంభీం చౌక్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం ద్వారా వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరణ అవడంతో పాటు ప్రమాదాలు తగ్గుతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీఎస్పీ జీవన్ రెడ్డి, ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, అడిషనల్ ఎస్పీ సురేందర్ రావు, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, వన్టౌన్ సీఐ సునీల్ కుమార్, ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్, ఎస్సైలు దేవేందర్ రావుల, మనీష్, ఇతర పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఓటర్ల మ్యాపింగ్ను విజయవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్:** ఎస్ఐఆర్–2002 ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో జిల్లా ప్రజలు చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపు నిచ్చారు. తాను కూడా తన ఓటును ఎస్ఐఆర్ ఎలక్టోరల్ రోల్కు మ్యాపింగ్ చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2002లో నిర్వహించిన ప్రత్యేక సర్వే (ఎస్ఐఆర్) సమయంలో తనకు ఓటు హక్కు లేకపోవడంతో అప్పట్లో బీహార్లో నమోదైన తన తండ్రి ఓటరు వివరాలను కేంద్ర ఎన్నికల సంఘం వెబ్సైట్లోని 'సెర్చ్ బై ఎలెక్టర్ నేమ్' సదుపాయం ద్వారా గుర్తించానన్నారు. కేవలం ఐదు ప్రాథమిక వివరాలు నమోదు చేసి ఓటరు సమాచారాన్ని కనుగొని, అనంతరం బీఎల్ఓ యాప్ ద్వారా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసినట్లు వివరించారు. ఈ ప్రక్రియ చాలా సులభమని పేర్కొన్నారు. తెలంగాణలో పాత ఓటరు నమోదు ఉన్నవారు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్సైట్ ద్వారా కూడా వివరాలను తెలుసుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా ఆదిలాబాద్ పట్టణం, మావల ప్రాంతాల ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.ఓటర్ల మ్యాపింగ్కు ఈనెల 24వ తేదీ వరకు గడువు ఉందని, అనంతరం జూన్ 25 నుంచి బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ చేపడతారని తెలిపారు. గడువులోపు అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను మ్యాపింగ్ చేసుకొని ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

# కలెక్టర్ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీఎంహెచ్ఓ



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా నూతన వైద్య ఆరోగ్య శాఖాధికారిణి (డీఎంహెచ్ఓ)గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి.సాధన బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్కు పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్ రాజర్షిషా నూతన బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సాధనకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేయాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి మనోహర్, డాక్టర్ నరేందర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాల పంపిణీ



**కాగజ్నగర్:** కాగజ్నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డులో బుధవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై అవగాహన కల్పించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల వ్యాప్తిని నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు. అలాగే తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను అందించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ షాహిద్ సుల్తాన్ అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, వివిధ శాఖల అధికారులు, 25వ వార్డు కౌన్సిలర్ దుర్గం సూరజ్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూలన, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెరగాలి

- **యువత మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా, రోడ్డు ప్రమాదాల నివారణకు కలిసికట్టుగా కృషి చేయాలి**
- **తోషం గ్రామసభలో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్**



**ఆదిలాబాద్:** ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని తోషం గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో డీజీపీ సి.వి. ఆనంద్ పాల్గొన్నారు. గ్రామసభ ప్రారంభానికి ముందు ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం గ్రామ పెద్దలు, గ్రామస్తులు డీజీపీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం కొమరంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుస్సాడి కళాకారులు సాంప్రదాయ నృత్య ప్రదర్శనలతో అతిథులను ఆహ్వానిస్తూ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆదివాసీల సమస్యలను డీజీపీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలు వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాలు, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. యువత విద్య, క్రీడలు, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా 30 మంది ఆటో డ్రైవర్లకు ప్రమాద సమయంలో ఉపయోగపడే ప్రథమ చికిత్స కిట్లను పంపిణీ చేశారు. ప్రమాదాల సమయంలో రక్తస్రావాన్ని నియంత్రించి ప్రాణాలను కాపాడడంలో ఈ కిట్లు ఎంతో ఉపయోగకరమని అన్నారు. అదేవిధంగా తోషం, తోషం తాండా, రాగాపూర్, బోర్రమద్ది, పూనగూడ, తోయిగూడ గ్రామాలకు చెందిన ఆదివాసి యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షిస్తూ ఐదు వాలీబాల్ కిట్లను అందజేశారు. గ్రామసభలో పాల్గొన్న సుమారు 200 మంది ప్రజలకు హెల్మెట్లను పంపిణీ చేసి, హెల్మెట్ ప్రాణ రక్షణలో కీలకపాత్ర పోషిస్తుందని వివరించారు. ప్రతిఒక్కరూ ద్విచక్ర వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. అలాగే కార్లలో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. అరైవ్.. అలైవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. రోడ్డు భద్రతపై కుటుంబ సభ్యుల్లో అవగాహన కల్పించడంలో మహిళల పాత్ర కీలకమని, వాహనాలు నడిపే వారు హెల్మెట్లు ధరించేలా ప్రోత్సహించాలని అన్నారు. యువతలో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలనే సదుద్దేశంతో నిర్వహించిన డ్రైవింగ్ లైసెన్స్ మేళాలో పాల్గొన్న 75 మంది యువతకు లర్నింగ్ లైసెన్సులను అందజేశారు. ప్రతి వాహనదారుడు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. గతంలో లొంగిపోయిన ముగ్గురు మావోయిస్టులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్టీజోన్–1 ఐజీ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు ఎస్పీ పి.మౌనిక, ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, ప్రజలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.





# సీసీ కెమెరాలతో నేరాలు, ప్రమాదాల నియంత్రణ సాధ్యం





- **రోడ్డు భద్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
- **రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద**

**మంచిర్యాల:** సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలు, రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు–భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం భీమారం మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్యలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానంగా పనిచేస్తూ ప్రతి అంశాన్ని రికార్డు చేస్తుందని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్, సీట్బెల్ట్ ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు సమాజమంతా కలిసి పనిచేయాలని పిలుపు నిచ్చారు. తదుపరి భీమారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల గ్రామసభలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు, వడ్డీలేని రుణాలు, బ్యాంక్ లింకేజీ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద చెన్నూర్ నియోజకవర్గానికి తొలి విడతలో 3,500 ఇళ్లు, రెండో విడతలో 2వేల ఇళ్లు కేటాయిస్తున్నట్లు వివరించారు. అర్హులకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పెన్షన్లు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చెన్నూర్లో వంద పడకల ఆసుపత్రిని త్వరలో ప్రారంభిస్తామని, స్టేడియం, నర్సింగ్ కాలేజీ మంజూరుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత నియమాలపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. అనంతరం మండలానికి చెందిన 28 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలి



- **కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్**
- **దీక్షలు ఉధృతం చేస్తామని హెచ్చరిక**

**కాగజ్నగర్:** సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం వెరిఫికేషన్ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) మరోసారి డిమాండ్ చేసింది. కార్మికుల ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించే దిశగా ఎన్నికల ప్రక్రియను ఆలస్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వం, కార్మిక శాఖ అధికారులు, మిల్లు యాజమాన్యాన్ని కోరింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అడ్డంకిగా ఉన్న కోర్టు కేసును యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల మెజారిటీ మద్దతు పొందిన సంఘానికి గుర్తింపు కల్పించడం ద్వారా పరిశ్రమలో శాంతియుత కార్మిక సంబంధాలు నెలకొంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం సానుకూలంగా స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో సిర్పూర్ పేపర్ మిల్లు ప్రధాన గేటు వద్ద కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని, ఎన్నికల నిర్వహణ వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్కు భారీ షాక్..

- **తెలంగాణ రక్షణ సేనలోకి యువత చేరిక**

**ఆదిలాబాద్:** జిల్లాలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సొనాల మండలం సాకేర గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ యువకులు బుధవారం తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టైలర్స్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర అబ్జర్వర్, బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి రాథోడ్ బాపు రావు ఆధ్వర్యంలో సుమారు 10 మంది యువకులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సంతోష్, కుందూరు సుధాకర్, కైలాస్, రాథోడ్ సాగర్, దిలీప్ జాదవ్, సురేష్, లక్ష్మణ్, కపిల్, రోహిదాస్, దినేష్ కుమార్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆశయాలు, ప్రజా సమస్యలపై పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు తమను ఆకర్షించాయని తెలిపారు. రాథోడ్ బాపురావు నాయకత్వంపై విశ్వాసంతోనే పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి యువత కీలక పాత్ర పోషించాలని రాథోడ్ బాపు రావు పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు.



# ప్రజా సంక్షేమంలో ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి





- **అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో చెన్నూర్లో విప్లవాత్మక మార్పులు**
- **రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద**

**మంచిర్యాల:** ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు–భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, ప్రజాప్రతినిధులతో కలిసి 60 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. గత ఏడాది 1.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఈ ఏడాది ఇప్పటికే 1.50 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోలు చేసినట్లు తెలిపారు. అకాల వర్షాల సమయంలో రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, బ్యాంకు లింకేజీ, ఆర్టీసీ బస్సుల నిర్వహణ అవకాశాలు కల్పిస్తూ ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సోలార్ పవర్ ప్లాంట్లలో కూడా మహిళల భాగస్వామ్యాన్ని పెంచుతున్నట్లు తెలిపారు.

### పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం..

చెన్నూర్ పట్టణంలో నూతనంగా నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే 5 పడకల డయాలసిస్ కేంద్రం సేవలందిస్తోందని, త్వరలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించి అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురానున్నామని చెప్పారు. ఆసుపత్రిలో పది పడకల ఐసీయూ, 23 మంది వైద్యులు, అవసరమైన సిబ్బంది, ఆధునిక వైద్య పరికరాలతో ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించనున్నట్లు వివరించారు.



### విద్య, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం..

చెన్నూర్ నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం చేపడుతున్నామని, దాదాపు 2వేల మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించనున్నామని మంత్రి తెలిపారు. డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.1.50 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. సీసీ రోడ్లు, మురుగు కాలువలు, సోలార్ హైమాస్ట్ లైట్లు, తాగునీటి పథకాలతో పాటు వివిధ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. రూ.30 కోట్లతో నీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టి రాబోయే 15 సంవత్సరాల పాటు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలో ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఈ ఏడాది 5వేల మంది విద్యార్థులు చేరడం ప్రజల్లో ప్రభుత్వ విద్యపై పెరిగిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు మెరుగుపడటంతో ప్రజలు అధిక సంఖ్యలో సేవలు వినియోగిస్తున్నారని తెలిపారు. అనంతరం చెన్నూర్ మున్సిపాలిటీకి మంజూరైన చెత్త సేకరణ వాహనాలను మంత్రి ప్రారంభించారు. ఒక్కో వాహనం రూ.10.50 లక్షల వ్యయంతో కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# భారీ వర్షా లకు రోడ్డుపై కూలిన చెట్టు తొలగింపు

- **సర్పంచ్, ఉప సర్పంచ్ చొరవతో పునరుద్ధరించిన రాకపోకలు**




**జైనూర్:** జైనూర్ మండలం జంగం గ్రామ పంచాయతీ పరిధిలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా ప్రధాన రహదారిపై ఓ పెద్ద చెట్టు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న వెంటనే గ్రామ సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజల సహకారంతో కూలిన చెట్టును తొలగించి రహదారిని శుభ్రపరిచారు. దీంతో రాకపోకలను తిరిగి పునరుద్ధరించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తక్షణ చర్యలు చేపట్టినందుకు గ్రామస్థులు సర్పంచ్, ఉప సర్పంచ్లను అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే గ్రామపంచాయతీకి సమాచారం అందించాలని సూచించారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.

# నీటి వృథాను అరికట్టి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

**ఎంపీడీఓ పి.శ్రీనివాస్**

**తాండూర్:** నీటి వృథాను అరికట్టి, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని తాండూర్ ఎంపీడీఓ పి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం తాండూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ముడిమడుగుల సురేష్ అధ్యక్షతన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, మొక్కల పెంపకం, వన మహోత్సవం, ఎస్ఐఆర్, వరద నిర్వహణ, భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ నీటి సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు చోరీకి



గురైన వెంటనే 1930 హెల్ప్లైన్ నంబర్కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కమ్మరి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి దొంద దివాకర్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చదువుతోనే ఉన్నత స్థాయికి ఎదగగలం

- **మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్**



**ఆదిలాబాద్:** పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువు ఒక్కటే మార్గమని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత విద్యాభ్యాసం వైపు ప్రోత్సహించాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు కేఆర్కే కాలనీలో నిర్వహించిన వార్డు సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ ప్రాంత సమస్యలను చైర్పర్సన్ దృష్టికి తీసుకువచ్చి దరఖాస్తులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 49 వార్డుల్లో కేఆర్కే కాలనీ అతిపెద్ద మురికివాడగా ఉందని, ఇక్కడ అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.9 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, తాగునీటి వంటి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రత్యేక అధికారిణి నిహారిక, వార్డు కౌన్సిలర్ నాగ్సెన్, అధికారులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు**



**మంచిర్యాల:** జిల్లాలో భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. బుధవారం తాండూర్, నెన్నెల, మందమర్రి మండలాల తహశీల్దార్ కార్యాలయాలను సందర్శించారు. సాదాబైనామా దరఖాస్తులు, భూభారతి పోర్టల్లో పెండింగ్లో ఉన్న భూ సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి పోర్టల్ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన సాదాబైనామా దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత, వేగం ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అలాగే ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, తహశీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ఆడే గజేందర్ పరామర్శ



బోథ్ మండలం తేజాపూర్ గ్రామానికి చెందిన చాకలి అర్జున్ భార్య ఇటీవల మృతి చెందగా, కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి నివాసానికి చేరుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఏలేటి మోహన్ రెడ్డి, మాజీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి అనుపట్ల సంజీవ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, వార్డు సభ్యులు మౌలానా, రమేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎండీ సద్దాం, విలాస్, శేఖర్, లింగన్న, సంతోష్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ బీజేపీ కుట్ర

**ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ**

**ఆదిలాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శి మల్యాల కరుణాకర్**



**గుడిహత్నూర్:** మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వెనుక బీజేపీ రాజకీయ కుట్ర దాగి ఉందని ఆదిలాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శి మల్యాల కరుణాకర్ ఆరోపించారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఓట్ల తొలగింపు, ప్రజాప్రతినిధుల కొనుగోళ్ల ద్వారా బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. ఎన్నికల కమిషన్ తటస్థంగా వ్యవహరించాల్సిన సమయంలో బీజేపీ అనుబంధ సంస్థలా మారిందని ఆరోపించారు. మొన్నటివరకు ఓట్లను దొంగిలించిన బీజేపీ, ఇప్పుడు ఎన్నికల ప్రక్రియలో సీట్లను కూడా చోరీ చేసే స్థాయికి దిగజారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంపై ప్రజాస్వామ్యవాదులు స్పందించాలని కోరారు. బీజేపీ, ఎన్నికల కమిషన్ అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ తరపున న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



# నాట్యావధాని ధారా రామనాథశాస్త్రి

తెలుగు నాటకరంగానికి అపూర్వ కళారూపాన్ని అందించిన మహామేధావి

## నేడు ధారా రామనాథశాస్త్రి జయంతి

తెలుగు నాటకరంగ చరిత్రలో కొన్ని పేర్లు కేవలం వ్యక్తులుగా కాకుండా ఒక కళాయుగానికి ప్రతీకలుగా నిలుస్తాయి. అలాంటి అరుదైన మహనీయుల్లో డాక్టర్ ధారా రామనాథశాస్త్రి అగ్రగణ్యులు. సాహిత్యం, నటన, పరిశోధన, బోధన, రంగస్థల కళలపై అపారమైన పట్టు కలిగిన ఆయన, తెలుగు నాటకరంగానికి సరికొత్త ప్రక్రియ అయిన నాట్యావధానాన్ని అందించి ప్రత్యేక స్థానం సంపాదించారు. అందుకే ఆయనను తెలుగు కళాజగత్తు గౌరవంగా లిలి"నాట్యావధాన విధాత"లిలిగా స్మరిస్తుంది.

సాహిత్యంలో అష్టావధానం, శతావధానం, నేత్రావధానం వంటి ప్రక్రియలు ప్రసిద్ధి చెందాయి. కానీ వాటికి భిన్నంగా నాటకరంగంలో ఒక వినూత్న ప్రయోగంగా నాట్యావధానం రూపుదిద్దుకుంది. ఇది నృత్యానికి సంబంధించిన కళారూపం కాదు. పూర్తిగా రంగస్థల నటన, సాహిత్య సృజన, ఆశుకవిత్వం, పాత్రధారణ, ఆహార్య నైపుణ్యాల సమ్మేళనం. పృచ్ఛకులు ఇచ్చే సమస్యను క్షణాల్లో అర్థం చేసుకొని, దానికి అనుగుణంగా పాత్రలను సృష్టించి, సంభాషణలను రచించి, పాత్రోచితమైన మేకప్‌తో రంగస్థలంపై ప్రదర్శించడం నాట్యావధాని ప్రత్యేకత.

సాధారణ నాటకంలో రచయిత, దర్శకుడు, నటుడు, మేకప్ కళాకారుడు వేర్వేరుగా ఉంటారు. కానీ నాట్యావధానంలో ఈ నాలుగు పాత్రలను ఒక్కరే నిర్వహించాలి. అంతేకాదు, పృచ్ఛకులు సూచించే సన్నివేశం పౌరాణికమైనదైనా, చారిత్రకమైనదైనా, సామాజికమైనదైనా లేదా సమకాలీనమైనదైనా దానికి తగ్గట్టుగా వెంటనే స్పందించి ప్రేక్షకులను ఆకట్టుకోవాలి. ఈ ప్రక్రియకు కావలసిన ఆశుధోరణి, సాహిత్యపాండిత్యం, నటనా నైపుణ్యం, పరకాయ ప్రవేశం వంటి లక్షణాలు ధారా రామనాథశాస్త్రిలో సమపాళ్లలో ఉండేవి. 1932 జూన్ 11న ప్రకాశం జిల్లా ఒంగోలులో సత్యవతమ్మ, వెంకటేశ్వరశాస్త్రి దంపతులకు జన్మించిన ధారా రామనాథశాస్త్రి కళాకారుల కుటుంబంలో పెరిగారు. ఆయన తాత ధారా వెంకట సుబ్బయ్య, తండ్రి వెంకటేశ్వరశాస్త్రి ఇద్దరూ రంగస్థల నటులే. చిన్ననాటి నుంచే నాటకాలు, బుర్రకథలు, హరికథలు చూసి కళారంగంపై ఆసక్తి పెంచుకున్నారు. చీరాల, తెనాలిలలో విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆయన గుంటూరు హిందూ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. అనంతరం డిగ్రీ పూర్తి చేసి మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ. పట్టా పొందారు. 1953లో ఒంగోలులోని సి.ఎస్.ఆర్. శర్మ కళాశాలలో అధ్యాపకునిగా చేరి 1995 వరకు సేవలందించారు. అధ్యాపకుడిగా వేలాది మంది విద్యార్థులకు విద్యాబోధన చేయడంతో పాటు కళాప్రేమను పెంపొందించారు.

1970లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి "తెలుగులో కృష్ణకథ" అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు. పరిశోధకుడిగా, విమర్శకుడిగా, సాహితీవేత్తగా కూడా ఆయన విశిష్ట సేవలందించారు. 1953లో ఒంగోలులో మొదటిసారి నాట్యావధాన ప్రదర్శన ఇచ్చిన ధారా రామనాథశాస్త్రి తరువాత దేశవ్యాప్తంగా 500కు పైగా ప్రదర్శనలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలే కాకుండా దేశంలోని అనేక ప్రాంతాల్లో ఈ కళాప్రక్రియను పరిచయం చేశారు. ఆయన ప్రదర్శనలను చూసిన ప్రేక్షకులు ఆశ్చర్యపోయేవారు. పాత్రలో ఆయన లీనమయ్యే తీరు, సంభాషణల్లో చమత్కారం, సాహిత్యపాండిత్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసేవి. ఆయన నాట్యావధానాన్ని పుట్టపర్తి సత్యసాయి బాబా, కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి, పండిట్ రవిశంకర్, హరీంద్రనాథ్ చటోపాధ్యాయ, పృథ్వీరాజ్ కపూర్, బలరాజ్ సహానీ, రాష్ట్రపతి వి.వి.గిరి, ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వంటి ప్రముఖులు ప్రశంసించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, బళ్ళారి రాఘవ అవార్డు, అనంత లక్ష్మీకాంత సాహితీ పురస్కారం, రామరాజభూషణ సాహిత్య పరిషత్ పురస్కారం, జీవితకాల సాధన పురస్కారం సహా అనేక గౌరవాలు ఆయనను వరించాయి. విజయవాడలో ఆయనకు కనకాభిషేకం నిర్వహించడం ఆయనకు లభించిన అపూర్వ గౌరవాల్లో ఒకటి. తెలుగు నాటకరంగానికి ఒక కొత్త కళారూపాన్ని అందించి, రంగస్థల కళకు సరికొత్త గౌరవాన్ని తెచ్చిన ధారా రామనాథశాస్త్రి 2016 ఆగస్టు 7న కన్నుమూశారు. అయితే ఆయన భౌతికంగా లేకపోయినా, నాట్యావధానం రూపంలో ఆయన సృజనాత్మకత నేటికీ జీవిస్తుంది. తెలుగు సంస్కృతి, సాహిత్యం, నాటకరంగ చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది.

**నటనకు నవ్యరూపం ఇచ్చిన కళాకారుడు...
నాటకరంగానికి కొత్త దిశ చూపిన సృజనశీలి...
తెలుగు సంస్కృతికి అపూర్వ వారసత్వాన్ని అందించిన
మహనీయుడు ధారా రామనాథశాస్త్రి.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# భారత జలాంతర్గాముల అసమాన సేవలు

## నేడు ఐఎన్ఎస్ సింధు వీర్ భారతీయ నౌకా దళంలో చేరిన రోజు

**ఐఎన్ఎస్ సింధు వీర్ 11జూన్ 1988న నౌకా దళంలో చేరిన రోజు... 1980లలో రష్యా నుంచి ఈ కిలో-క్లాస్ సబ్‌మెరైన్‌ను భారత్ కొనుగోలు చేసింది. వైజాగ్‌లోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హూ)లో ఆధునికీకరించ బడింది.**



భారతీయ నౌకా దళం భారత సాయుధ బలగాలలో ఒక శాఖ. దేశ రాష్ట్రపతి దీనికి అధిపతిగా వ్యవహరిస్తారు. 5000 మంది నౌకా వైమానిక దళ సభ్యులు, 2000 మంది నౌకా దళ కమెండోలతో సహా యుద్ధ సన్నద్ధంగా ఉండే 55,000 మంది సభ్యులు గలిగి ప్రపంచంలో 5వ పెద్ద నౌకాదళంగా వుంది. భారత నౌకా దళం 155 నౌకల్ని కలిగి ఉంది. ఆసియాలో జెట్ యుద్ధ విమానాల్ని కలిగి ఉన్న విమాన వాహక నౌకని, నడిపే ఏకైక నావికా దళం. భారత రక్షణ వ్యవస్థలో భాగమయిన భారత నావికా దళం (ఇండియన్ నేవీ) కేవలం దేశరక్షణకే కాకుండా మానవతా సహాయాలకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు సహాయం కొరకు భారత ప్రభుత్వం నేవీని వినియోగిస్తుంది.

ఇండియన్ నేవీలో 16 సబ్‌మెరైన్‌లు (జలాంతర్గాములు) ఉన్నాయి. ఇందులో ఎక్కువ రష్యా, జర్మనీలనుండి కొనుగోలు చేసినవి. ఇందులో ప్రధాన మయినవి సింధుఘోష్ తరగతికి చెందినవి. ఈ తరగతిలో మొత్తం 10 సబ్‌మెరైన్‌లు ఉన్నాయి. వీటి బరువు 3,000 టన్నులు. ప్రతి సబ్‌మెరైన్‌లో 220 కిమీ దూరంలోపు ఉన్న నౌకల పైన ప్రయోగించ గలిగే మిస్సైళ్ళు ఉన్నాయి. ఈ సబ్‌మెరైన్‌లు సముద్రంలో 300 మీటర్ల లోతువరకు వెళ్లగలగి, 18 నాట్ల వేగంతో 45 రోజుల పాటు సముద్ర ఉపరితలాన్ని చేరుకోకుండా ప్రయాణించ గలవు. 1985 నుండి అణు సబ్‌మెరైన్‌లను నిర్మించడానికి కల్పాక్కం వద్ద ఉన్న అణు కేంద్రంతో కలిసి నేవీ కృషి చేస్తున్నది. 2010 నాటికి 6,000 టన్నులు బరువు కలిగి, పూర్తి అణు సామర్థ్యం కలిగిన సబ్‌మెరైన్‌ను, 2010-2025 నాటికి ఇలాంటివి మరో నాలుగు నిర్మించడానికి అవసరమైన చర్యలు చేపట్టడం జరిగింది. భారత నౌకాదళం లోని అన్ని యుద్ధ నౌకలకు ముందు 'ఇండియన్ నేవల్ షిప్' (ఐ.ఎన్.ఎస్), జలాంతర్గాములకు ముందు 'ఇండియన్ నేవల్ సబ్ మెరైన్ (ఐ.ఎన్.ఎస్.) ' అని చేరుస్తారు. నీటిలో మునిగి ప్రయాణం చెయ్యగల వాహనం. వివిధ దేశాల నావికా రక్షణ దళాల్లో జలాంతర్గామి ఒక ముఖ్య భాగం. జలాంతర్గామిని మొదటగా మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో విస్తృతంగా ఉపయోగించారు. జలాంతర్గాములు అనేక రకాలైన మిషన్లను చేపట్ట గలవు. యాంటీ-సర్ఫేస్ వార్‌ఫేర్, యాంటీ- సబ్‌మెరైన్ వార్‌ఫేర్, ఇంటెలిజెన్స్ సేకరణ, మైన్ లేయింగ్, తీర ప్రాంతాల్లో నిఘా తదితర మిషన్లు చేపట్టవచ్చు.

### భారత నౌకాదళంలో చేరిన కొన్ని జలాంతర్గాములు

- ఐఎన్ఎస్ సింధుధ్వజ్... 12 జనవరి,1987, ఐ.ఎన్.ఎస్. షల్కి ...07 ఫిబ్రవరి 1992, ఐ.ఎన్.ఎస్. సింధుఘోష్ ...30 ఏప్రిల్ 1986,
- ఐఎన్ఎస్ షంకుల్ ....28 మే 1994, ఐ.ఎన్.ఎస్. సింధువీర్...11 జూన్ 1988, ఐ.ఎన్.ఎస్. సింధుశస్త్ర...19 జూలై 2000,
- ఐఎన్ఎస్ వగ్లి ....10 ఆగష్టు 1974, ఐ.ఎన్.ఎస్. వేల ....31 ఆగష్టు 1973, ఐ.ఎన్.ఎస్. శాతవాహన... 21 డిసెంబర్1974,
- ఐఎన్ఎస్ షిషుమార్...22 సెప్టెంబరు1986, ఐ.ఎన్.ఎస్. సింధురాజ్ ...20 అక్టోబరు 1987,
- ఐఎన్ఎస్ సింధురత్న...19 నవంబరు 1988, ఐఎన్ఎస్ షంకుష్ ...20 నవంబరు1986,
- ఐఎన్ఎస్ సింధుకీర్తి ...09 డిసెంబరు1989, ఐఎన్ఎస్ సింధు విజయ్...17డిసెంబర్1990,
- ఐఎన్ఎస్ సింధు కేసరి... 19డిసెంబర్1988, ఐఎన్ఎస్ సింధు రక్షక్ ...24 డిసెంబర్1997, ఐఎన్ఎస్ విరాట్...27 సంవత్సరాల సేవ తరువాత 2016 లో ఈ నౌకను నౌకాదళం నుండి విరమింప జేసారు. 2013లో ఐఎన్ఎస్ విక్రమాదిత్య కమిషను కాకముందు, విరాట్‌యే భారత నౌకాదళపు ఫ్లాగ్‌షిప్ నౌక. పని విరమించే ముందు వరకూ ఇది ప్రపంచం లోనే అత్యంత పాత విమాన వాహక నౌక. 1959 లో బ్రిటిషు నౌకాదళంలో హెచ్ ఎం ఎస్ హెర్మెస్‌గా చేరిన ఈ నౌకను 1987లో భారత్ కొని, 1987 మే 12 న ఐఎన్ఎస్ విరాట్‌గా పేరు పెట్టింది. ఐఎన్ఎస్స్ విక్రమాదిత్య.. విక్రమాదిత్య భారత్ రష్యా నుండి కొనుగోలు చేసిన విమాన వాహక నౌక. కీయెవ్ తరగతికి చెందిన అడ్మిరల్ గోర్‌ష్కోవ్ విమాన వాహక నౌకను విక్రమాదిత్యగా పునర్నిర్మించారు. ఇది 2013 లో భారతీయ నౌకాదళం లోకి ప్రవేశించింది.
- ఐఎన్ఎస్ విక్రాంత్ (2013)...భారత్‌లో నిర్మించిన మొదటి విమాన వాహక నౌక. 2013 లో దీన్ని నిర్మించారు. ఇది తేలిక పాటి విమాన వాహక నౌక.
- ఐఎన్ఎస్ చక్ర...అణు జలాంతర్గామి.. ఐఎన్ఎస్ అరిహంత్.. న్యూక్లియర్ సబ్‌మెరైన్.

న్యూక్లియర్ మిస్సైల్స్‌ను ప్రయోగించే సబ్‌మెరైన్ల కోసం ఇక్కడ సముద్ర గర్భంలో అధునాతన బెర్తులు రూపుదిద్దు కుంటున్నాయి.విశాఖపట్నం కేంద్రంగా స్వదేశీ పరిజ్ఞానంతో తొలి న్యూక్లియర్ సబ్‌మెరైన్ అరిహంత్ నిర్మాణం జరిగింది. సముద్రంపైన, భూమిపైన యుద్ధం చేయగల ఐఎన్ఎస్ జలాశ్వతో పాటు అణు ఇంధనంతో పనిచేసే సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ చక్ర ఇక్కడి నుంచే సేవలు అందిస్తోంది. చైనా వద్ద 56 సబ్‌మెరైన్లు ఉండగా మన దగ్గర 14 మాత్రమే వున్నాయి. చైనా ఇప్పటికే ఐదు న్యూక్లియర్ సబ్‌మెరైన్లను సమకూర్చు కోగా మనం తొలి న్యూక్లియర్ జలాంతర్గామి (అరిహంత్) నిర్మాణంలో ఉన్నాయి.

ఫ్రెంచ్ నావికాదళ రక్షణ, ఇంధన సంస్థ డీసీఎన్ఎస్ రూపొందించిన జలంతార్గములను భారత నేవీ ఫోర్స్ ప్రాజెక్ట్ 75లో భాగంగా ముంబైలోని మజగాన్ డాక్ లిమిటెడ్ (ఎండీఎల్) నిర్మిస్తోంది. ఆరు స్కార్పీన్ క్లాస్ జలాంతర్గాము ల్లోని మొదటిదైన ఐఎన్ఎస్ కల్వరిని 2017 డిసెంబర్‌లో భారత నావికాదళం లోకి ప్రవేశ పెట్టారు. ఇది డీజిల్ ఎలక్ట్రిక్ అటాక్ జలాంతర్గామి. 2017లో ప్రవేశపెట్టిన ఐఎన్ఎస్ ఖండేరి రెండవది కాగా.. మూడోది ఐఎన్ఎస్ కరంజ్ 2018 నేవీ దళంలో చేరింది. ఇక, నాల్గోది ఐఎన్ఎస్ వెలా 2019 నుంచి సేవలందిస్తుంది. శత్రు దేశాల క్షిపణులు, జలాంతర్గాముల కళ్లుగప్పే స్టెల్త్ సాంకేతిక పరిజ్ఞానంతో, ప్రాజెక్ట్ 75లో భాగంగా రూపొందించిన ఐదో స్కార్పీన్ తరగతి జలాంతర్గామి ఇటీవలే మజగావ్ డాక్ వద్ద అరేబియా సముద్ర జలాల్లో జల ప్రవేశం చేసింది. ప్రస్తుతం సబ్‌మెరైన్ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు చర్యలు జరుగు తున్నాయి. ఇందులో భాగంగా రాబోవు 30 సంవత్సరాలలో 24 సబ్‌మెరైన్‌లు నేవీ అమ్ముల పొదిలో చేరబోతున్నాయి. ప్రస్తుత మార్పులను బట్టి హిందూ మహాసముద్ర ప్రాంతంలోని అన్ని దేశలలో భారత నావికా దళం అత్యంత బలమయినదిగా తయారవుతున్నదని చెప్పవచ్చు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# అసమాన వ్యంగ్య చిత్ర కారుడు అబూ అబ్రహాం



అంతర్జాతీయ వేదికలపై భారతీయ కార్టూన్ ముద్ర వేసిన అసాధారణ ప్రతిభాశాలి

రాజ్యసభ సభ్యుడిగా, ఎమర్జెన్సీ కాలంలో నిర్భీతిగా కలం ఝుళిపించిన యోధుడు

## నేడు అబూ అబ్రహాం జయంతి

రాజకీయ కార్టూన్లను కేవలం ఒక కళగా కాకుండా సామాజిక అస్త్రంగా మలచి, లండన్ నుండి ఢిల్లీ వరకు అంతర్జాతీయ పత్రికా రంగంలో చెరగని ముద్ర వేసిన ప్రఖ్యాత వ్యంగ్య చిత్రకారుడు అబూ అబ్రహాం 102వ జయంతి నేడు. నిర్భీతికి, పత్రికా స్వేచ్ఛకు నిలువెత్తు రూపంగా నిలిచిన అబూ.. దశాబ్దాల పాటు ప్రపంచవ్యాప్తంగా తన వాడి, వేడి రాజకీయ కార్టూన్లతో పాలకుల గుండెల్లో నిద్రపోయారు. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన 'ది అబ్జర్వర్' పత్రికకు మొట్టమొదటి రాజకీయ వ్యంగ్య చిత్రకారుడిగా పనిచేసి అంతర్జాతీయ ఖ్యాతి గడించిన అబూ, సామాన్యంగా ఇంట గెలిచి రచ్చ గెలవడం కాకుండా.. విదేశాల్లో సంచలనాలు సృష్టించి మాతృభూమికి తిరిగి రావడం ఆయన ప్రత్యేకత.

### మూడో ఏట నుంచే బొమ్మల ప్రస్థానం

కేరళలోని మవేలికర గ్రామంలో ఎ.ఎం.మాథ్యూ, కాంతమ్మ దంపతులకు జన్మించిన అత్తుపురథు మాథ్యూ అబ్రహామ్ (అబూ) పువ్వు పుట్టగానే పరిమళించినట్లు తన మూడో ఏట నుంచే బొమ్మలు ే యడం ప్రారంభించారు. తిరువనంతపురం యూనివర్సిటీ కాలేజీలో ఫ్రెంచ్, గణితం, ఇర్లేషు ఐచ్ఛికాంశాలుగా డిగ్రీ పూర్తి చేసిన ఆయన, విద్యార్థి దశలో టెన్నిస్ ఛాంపియన్‌గా కూడా రాణించారు. అనంతరం బాంబే చేరి 'బాంబే క్రానికల్', 'బ్లిట్జ్', 'భారత్' వంటి పత్రికల్లో జర్నలిస్ట్‌గా, కార్టూనిస్ట్‌గా కెరీర్ ప్రారంభించారు. అబూలోని అసమాన ప్రతిభను గుర్తించిన ప్రముఖ కార్టూనిస్ట్ కె.శంకర్ పిళ్ళై 1951లో ఆయనను ఢిల్లీకి ఆహ్వానించి 'శంకర్స్ వీక్లీ'లో అవకాశం కల్పించారు.

### లండన్ పత్రికల్లో వామపక్ష భావజాల ఝురి

లండన్ పత్రిక 'ది స్టార్' సంపాదకుడి ప్రోత్సాహంతో 1953లో బ్రిటన్ వెళ్లిన అబూ.. పంచ్, డైలీ స్కెచ్, ఈస్టర్న్ వరల్డ్ వంటి ఎన్నో అంతర్జాతీయ పత్రికల్లో 'అబ్రహాం' అనే పేరుతో కార్టూన్లు వేశారు. 1956లో ప్రఖ్యాత 'ది అబ్జర్వర్' పత్రికలో రాజకీయ కార్టూనిస్టుగా స్థిరపడిన తర్వాత, ఆ పత్రిక సంపాదకుడి సలహా మేరకు తన పేరును చిన్ననాటి ముద్దుపేరు 'అబూ'గా మార్చుకున్నారు. బ్రిటిష్ సంస్కృతిని, రాజకీయాలను ఆకళింపు చేసుకుని ఆయనే సిన వ్యంగ్య చిత్రాలను చూసి 'ది గార్డియన్' పత్రిక అబూను 'ప్రభుత్వానికి పక్కలో బల్లెం' లాంటి వాడంటూ అప్పట్లోనే అభివర్ణించింది. 1962లో క్యూబా పర్యటనలో చేగువేరాను కలిసి ఆయన చిత్రాన్నిే సిన ఘనత కూడా అబూదే.

### ఎమర్జెన్సీపై ధిక్కార స్వరం

1969లో భారతదేశానికి తిరిగి వచ్చిన అబూ.. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికలో చేరి 1981 వరకు సేవలందించారు. ఆయన ప్రతిభను గుర్తించి ప్రభుత్వం 1972-78 మధ్యకాలంలో ఆయనను రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేసింది. అయితే, 1975లో దేశంలో ఎమర్జెన్సీ విధించి పత్రికా స్వేచ్ఛను హరించినప్పుడు అబూ తన ధిక్కార స్వరాన్ని కార్టూన్ల రూపంలో చూపించారు. ఎమర్జెన్సీ రోజుల్లో మీడియా రంగం వంగమంటే సాష్టాంగపడిందనే అపప్రథ ఉన్నప్పటికీ, అబూ మాత్రం సెన్సార్ అధికారుల కళ్లు గప్పి అత్యంత తెలివిగా, ధైర్యంగా ఇందిరా గాంధీ సర్కారుపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆ రోజుల్లో ప్రచురణకు నోచుకోని కార్టూన్లతో పత్రికా స్వేచ్ఛ పునరుద్ధరించబడిన తర్వాత 'గేమ్స్ ఆఫ్ ఎమర్జెన్సీ' అనే చారిత్రాత్మక పుస్తకాన్ని తీసుకువచ్చారు.

### చివరి శ్వాస వరకు కార్టూన్ లోకంలోనే..

1970లో అబూ రూపొందించిన 'నో ఆర్క్స్' అనే షార్ట్ ఫిలింకు బ్రిటిష్ ఫిలిం ఇన్స్టిట్యూట్ ప్రత్యేక అవార్డు దక్కింది. 'అబూ ఆన్ బాంగ్లాదేశ్', 'ప్రైవేట్ వ్యూ' వంటి ఎన్నో అద్భుతమైన పుస్తకాలను ఆయన వెలువరించారు. 1981 నుండి ఫ్రీలాన్సర్‌గా మారి 'సాల్ట్ అండ్ పెప్పర్' అనే ప్రసిద్ధ స్ట్రిప్ కార్టూన్ ద్వారా అలరించారు. ఎంతోమంది పాలకులను తన వ్యంగ్య బాణాలతో కడిగిపారేసిన అబూ.. 2002 డిసెంబరు 1న కన్నుమూశారు. ఆయన మరణానికి సంతాపంగా దేశ అత్యున్నత సభ రాజ్యసభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించగా, కేరళ ప్రభుత్వం ఆయన అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో ఘనంగా నిర్వహించింది. భయమెరుగని కార్టూనిజానికి అబూ అబ్రహాం పేరు ఎప్పటికీ ఒక నిఘంటువులా నిలిచిపోతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# బంగారం, వెండి ధరల్లో భారీ పతనం

**హైదరాబాద్, జూన్ 10:** బంగారం కొనుగోలు చేయాలని ఎదురుచూస్తున్న వారికి ఊరట కలిగించే వార్త వచ్చింది. దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీగా తగ్గడంతో కొనుగోలుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పెళ్లిళ్లు, శుభకార్యాల కోసం బంగారం కొనుగోలు చేయాలనుకుంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ ధరల తగ్గుదల ఉపశమనాన్ని కలిగిస్తోంది. బుధవారం ఉదయం మార్కెట్ ప్రారంభమైన తర్వాత బంగారం ధరలు గణనీయంగా పతనమయ్యాయి. పది గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారంపై ఏకంగా రూ.4,300 తగ్గగా, 22 క్యారెట్ల బంగారంపై రూ.3,950 మేర తగ్గుదల నమోదైంది. అలాగే 18 క్యారెట్ల బంగారంపై రూ.3,230 తగ్గింది. తాజా ధరల ప్రకారం హైదరాబాద్ మార్కెట్‌లో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,48,860గా నమోదైంది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,36,450కు చేరుకుంది. ఇక 18 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,11,640 వద్ద ట్రేడవుతోంది. బంగారంతో పాటు వెండి ధరల్లోనూ భారీ తగ్గుదల కనిపించింది. వంద గ్రాముల వెండిపై రూ.1,000 తగ్గగా, కిలో వెండిపై ఏకంగా రూ.10,000 తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్‌లో వంద గ్రాముల వెండి ధర రూ.26,000గా ఉండగా, కిలో వెండి ధర రూ.2,60,000 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న మార్పులు, డాలర్ మారకం విలువల్లో హెచ్చుతగ్గులు, పెట్టుబడిదారుల ధోరణి వంటి కారణాల వల్ల విలువైన లోహాల ధరల్లో ఈ మార్పులు చోటుచేసుకున్నట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ధరలు తగ్గిన నేపథ్యంలో నగల వ్యాపారులు, కొనుగోలుదారులు మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ పరిస్థితులను బట్టి బంగారం, వెండి ధరల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ధరలు తగ్గిన ఈ సమయంలో కొనుగోలు చేయాలనుకునేవారు స్థానిక ఆభరణాల దుకాణాల్లో తాజా ధరలను ఒకసారి నిర్ధారించుకుని నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు.

# భారీ బ్యాటరీతో రియల్‌మీ కొత్త ఫోన్

**హైదరాబాద్, జూన్ 10:** స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ఎదుర్కొనే ప్రధాన సమస్యల్లో బ్యాటరీ త్వరగా ఖాళీ కావడం ఒకటి. ఈ సమస్యకు పరిష్కారంగా రియల్‌మీ సంస్థ భారీ బ్యాటరీ సామర్థ్యంతో కూడిన కొత్త 5జీ స్మార్ట్‌ఫోన్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. అత్యాధునిక సాంకేతికత, కృత్రిమ మేధస్సు ఆధారిత ఫీచర్లు, గేమింగ్‌కు అనుకూలమైన సదుపాయాలతో ఈ ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కొత్తగా విడుదలైన ఈ స్మార్ట్‌ఫోన్‌లో ఏకంగా 8,000 ఎంఏహెచ్ సామర్థ్యం కలిగిన బ్యాటరీని అమర్చారు. ఇంత భారీ బ్యాటరీ ఉన్నప్పటికీ ఫోన్ మందం కేవలం 8.8 మిల్లీమీటర్లే ఉండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. యువత, గేమింగ్ ప్రియులను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ ఫోన్ మధ్యతరగతి వినియోగదారులకు అందుబాటు ధరలో లభిస్తోంది. ఈ ఫోన్ ప్రారంభ ధర రూ.18,999గా నిర్ణయించారు. నాలుగు జీబీ ర్యామ్, 128 జీబీ నిల్వ సామర్థ్యం కలిగిన ప్రాథమిక వేరియంట్ ధర రూ.18,999 కాగా, ఆరు జీబీ ర్యామ్, 128 జీబీ నిల్వ సామర్థ్యం గల వేరియంట్ ధర రూ.20,999గా ఉంది. అలాగే ఆరు జీబీ ర్యామ్, 256 జీబీ నిల్వ సామర్థ్యం కలిగిన అత్యున్నత వేరియంట్ ధర రూ.22,999గా నిర్ణయించారు. లావెండర్, సిల్వర్, టైటానియం రంగుల్లో ఈ ఫోన్ లభిస్తోంది. బ్యాటరీ పనితీరు ఈ ఫోన్‌కు ప్రధాన బలం. ఒకసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే సాధారణ వినియోగంలో మూడు రోజుల వరకు బ్యాటరీ నిలుస్తుందని సంస్థ వెల్లడించింది. నిరంతరాయంగా గేమింగ్, వీడియో వీక్షణ, సరా త వినియోగం వంటి కార్యకలాపాలకు కూడా దీర్ఘకాలిక బ్యాకప్ అందిస్తుందని పేర్కొంది. ఫోన్‌లో అధునాతన ప్రాసెసర్‌ను అమర్చడంతో పాటు గేమింగ్ సమయంలో వేడి తగ్గించేందుకు ప్రత్యేక శీతలీకరణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీంతో ఎక్కువసేపు గేమ్స్ ఆడినా పనితీరులో ఎలాంటి అంతరాయం ఉండదని కంపెనీ చెబుతోంది. ఆండ్రాయిడ్ 16 ఆధారిత తాజా ఆపరేటింగ్ వ్యవస్థతో పనిచేసే ఈ ఫోన్‌లో 6.8 అంగుళాల పెద్ద డిస్‌ప్లేను అందించారు. వేగవంతమైన స్క్రోలింగ్, గేమింగ్ అనుభవం కోసం అధిక రిఫ్రెష్ రేట్‌ను కూడా అందుబాటులో ఉంచారు. ఫొటోగ్రఫీ ప్రియులను ఆకట్టుకునేలా వెనుక భాగంలో 50 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరాను ఏర్పాటు చేశారు. దీనికి తోడు అదనపు కెమెరా సెన్సార్ కూడా ఉంది. సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం ముందు భాగంలో 8 మెగాపిక్సెల్ కెమెరా అందించారు. అదనంగా, ఫోన్ వెనుక భాగంలో ప్రత్యేక నోటిఫికేషన్ లైటింగ్ వ్యవస్థను అమర్చారు. కాల్స్, సందేశాలు, ఇతర అలర్ట్‌ల కోసం వెలిగే ఈ లైట్‌ను వినియోగదారులు తమ అభిరుచికి అనుగుణంగా వివిధ రంగులు, వేగాలతో మార్చుకునే సదుపాయం కల్పించారు. భారీ బ్యాటరీ, ఆకర్షణీయమైన ఫీచర్లు, అందుబాటు ధరతో విడుదలైన ఈ కొత్త స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో మంచి ఆదరణ పొందే అవకాశాలు ఉన్నాయని సాంకేతిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# విమాన ప్రయాణికులకు షాక్

## పెరిగిన ఇంధన ధరలు, టికెట్లపై ప్రభావం

**న్యూఢిల్లీ, జూన్ 10:** విమాన ప్రయాణం చేయాలని భావిస్తున్న వారికి కీలక సమాచారం. విమానాల్లో ఉపయోగించే ఏవియేషన్ టర్బైన్ ఇంధనం ధరలను చమురు సంస్థలు గణనీయంగా పెంచడంతో విమాన టికెట్ ధరలు కూడా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాధారణంగా ఇంధన వ్యయం పెరిగినప్పుడు ఆ అదనపు భారాన్ని విమానయాన సంస్థలు ప్రయాణికులపై మోపడం ఆనవాయితీ. దీంతో రాబోయే రోజుల్లో దేశీయ, అంతర్జాతీయ విమాన టికెట్ల ధరల్లో పెరుగుదల నమోదయ్యే అవకాశం ఉందని రంగ నిపుణులు భావిస్తున్నారు. విమానయాన రంగంలో ఇంధన వ్యయం అత్యంత కీలక అంశం. విమాన సంస్థల మొత్తం నిర్వహణ ఖర్చుల్లో దాదాపు 40 నుంచి 60 శాతం వరకు ఇంధనానికే వెచ్చించాల్సి వస్తుంది. ఇటీవల అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం, పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ఇంధన వ్యయాన్ని మరింత పెంచాయి. దీంతో దేశీయంగా కూడా విమాన ఇంధన ధరల పెంపు అనివార్యమైందని చమురు సంస్థలు పేర్కొంటున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రయాణికులపై భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ పథకంలో చేరే విమాన సంస్థలకు లీటరు విమాన ఇంధన ధరను నిర్దిష్ట స్థాయిలో స్థిరంగా ఉంచే అవకాశం కల్పించనుంది. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరిగినా కొంతకాలం వరకు అదే ధర కొనసాగుతుండటంతో సంస్థలకు వ్యయాలపై స్పష్టత లభిస్తుంది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానం వల్ల విమాన సంస్థలు ఆకస్మికంగా టికెట్ ధరలను భారీగా పెంచే పరిస్థితులు తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా సెలవుల కాలం,



పండుగలు, పర్యాటక సీజన్ వంటి రద్దీ సమయాల్లో ప్రయాణికులకు ఇది కొంత ఊరటనివ్వనుంది. అయితే ఇంధన ధరల పెంపు ప్రభావం పూర్తిగా లేకపోతుందని చెప్పలేమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇంధన వ్యయం పెరిగిన నేపథ్యంలో కొన్ని మార్గాల్లో టికెట్ ధరలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. అందువల్ల ముందస్తుగా ప్రయాణ ప్రణాళికలు సిద్ధం చేసుకుని టికెట్లు బుక్ చేసుకోవడం ప్రయాణికులకు ప్రయోజనకరంగా ఉంటుంది. విమాన ప్రయాణ ఖర్చులను తగ్గించుకోవాలనుకునే వారు ముందుగానే టికెట్లు కొనుగోలు చేయడం, తక్కువ రద్దీ ఉన్న రోజుల్లో ప్రయాణాలను ప్లాన్ చేసుకోవడం, వివిధ విమానయాన సంస్థల ధరలను పోల్చి చూసుకోవడం వంటి చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన తాజా చర్యలతో విమాన టికెట్ ధరల్లో అకస్మాత్తుగా భారీ పెరుగుదల వచ్చే అవకాశాలు తగ్గినప్పటికీ, అంతర్జాతీయ చమురు ధరల పరిస్థితులను బట్టి భవిష్యత్తులో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# గుండె సమస్యలు గుర్తించే స్మార్ట్‌వాచ్‌లు

**హైదరాబాద్, జూన్ 10:** సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో ఆరోగ్య సంరక్షణ కూడా మరింత సులభంగా మారుతోంది. ఒకప్పుడు ఆరోగ్య సమస్యలను గుర్తించాలంటే తప్పనిసరిగా ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు చేతికి ధరించే స్మార్ట్‌వాచ్‌లు అనేక ఆరోగ్య సూచికలను నిరంతరం పరిశీలిస్తూ వినియోగదారులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడంలో ఈ పరికరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత కాలంలో వేగవంతమైన జీవనశైలి, అధిక ఒత్తిడి, శారీరక శ్రమ లోపం కారణంగా గుండె జబ్బులు, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయి. ఉద్యోగాలు, వ్యాపారాలు, వ్యక్తిగత బాధ్యతల మధ్య చాలామంది తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోకపోవడం వల్ల అనేక సమస్యలు ఆలస్యంగా బయటపడుతున్నాయి. ఈ నేపథ్యంలో స్మార్ట్‌వాచ్‌లు వ్యక్తిగత ఆరోగ్య పర్యవేక్షకులుగా మారాయి. గుండె స్పందన, రక్తంలోని ఆక్సిజన్ శాతం, నిద్ర నాణ్యత, రోజువారీ శారీరక చురుకుదనం వంటి అంశాలను ఇవి నిరంతరం నమోదు చేస్తుంటాయి. సాధారణ స్థాయికి భిన్నంగా ఏవైనా మార్పులు చోటుచేసుకుంటే వెంటనే అలర్ట్‌లు పంపించి వినియోగదారులను అప్రమత్తం చేస్తాయి. ముఖ్యంగా గుండె వేగం అసాధారణంగా పెరగడం లేదా తగ్గడం, గుండె స్పందనలో అసమానతలు కనిపించడం వంటి పరిస్థితులను ఆధునిక స్మార్ట్‌వాచ్‌లు గుర్తించగలుగుతున్నాయి. ఈ హెచ్చరికల ఆధారంగా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకున్న అనేక మందిలో గుండె సంబంధిత సమస్యలు ప్రారంభ దశలోనే బయటపడినట్లు వైద్యులు వెల్లడిస్తున్నారు. ఇటీవలి కాలంలో స్మార్ట్‌వాచ్‌ల నుంచి వచ్చిన హెచ్చరికల కారణంగా



ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య కూడా పెరుగుతోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. గుండె స్పందనలో లోపాలు, అధిక రక్తపోటు, గుండె రక్తనాళాల సమస్యలు వంటి అనేక వ్యాధులను ముందుగానే గుర్తించడంలో ఈ పరికరాలు సహాయపడుతున్నాయని వారు పేర్కొంటున్నారు. అయితే స్మార్ట్‌వాచ్‌లు ఇచ్చే సమాచారం కేవలం ప్రాథమిక హెచ్చరిక మాత్రమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అవి వైద్య నిర్ధారణకు ప్రత్యామ్నాయం కావని, ఎలాంటి అలర్ట్ వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, తగినంత నిద్రపోవడం అవసరమని వైద్యులు చెబుతున్నారు. అలాగే స్మార్ట్‌వాచ్‌లపై మాత్రమే ఆధారపడకుండా నిర్దిష్ట వ్యవధిలో పూర్తి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం కూడా అత్యంత ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. సాంకేతికత అందిస్తున్న ఈ కొత్త అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే గుండె సంబంధిత వ్యాధులను ముందుగానే గుర్తించి ప్రాణాపాయ పరిస్థితులను నివారించే అవకాశం ఉంటుందని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# మూడు నిమిషాల్లో బ్యాటరీ మార్పిడి

## ఎలక్ట్రిక్ కార్ల రంగంలో కొత్త విప్లవం

**న్యూఢిల్లీ, జూన్ 10 :** భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ, బ్యాటరీ ఛార్జింగ్ సమయం మరియు ప్రయాణ పరిధిపై ఉన్న సందేహాలు ఇప్పటికీ చాలామందిని ఆలోచింపజేస్తున్నాయి. ముఖ్యంగా సుదూర ప్రయాణాల్లో ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో లేకపోవడం, బ్యాటరీ పూర్తిగా ఛార్జ్ కావడానికి గంటల సమయం పట్టడం వంటి సమస్యలు వినియోగదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ సమస్యలకు పరిష్కారంగా బ్యాటరీ మార్పిడి సాంకేతికతతో రూపొందించిన కొత్త ఎలక్ట్రిక్ కారు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ సరికొత్త విధానంలో బ్యాటరీని శాశ్వతంగా వాహనంలో అమర్చకుండా అవసరమైనప్పుడు తీసివేసి, పూర్తిగా ఛార్జ్ చేసిన మరో బ్యాటరీని అమర్చుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. సాధారణంగా పెట్రోల్ లేదా డీజిల్ వాహనాల్లో ఇంధనం నింపుకోవడానికి కొన్ని నిమిషాలే పడుతుంది. అదే విధంగా భవిష్యత్తులో బ్యాటరీ మార్పిడి కేంద్రాలకు వెళ్లి కేవలం కొన్ని నిమిషాల్లో కొత్త బ్యాటరీని అమర్చుకుని ప్రయాణాన్ని కొనసాగించే అవకాశం ఈ సాంకేతికత ద్వారా లభించనుంది. కంపెనీ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ బ్యాటరీ వ్యవస్థ అత్యంత వేగవంతంగా పనిచేస్తుంది. కేవలం మూడు నిమిషాల వ్యవధిలో బ్యాటరీ మార్పిడి పూర్తవుతుండగా, ఒక్కసారి పూర్తిగా సిద్ధమైన బ్యాటరీతో సుమారు 250 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని చెబుతున్నారు. ప్రతిరోజూ ఎక్కువ దూరం ప్రయాణించే ఉద్యోగులు, వ్యాపారులు, డెలివరీ




సేవల్లో పనిచేసే వారు, అలాగే ఇంటి వద్ద ఛార్జింగ్ సౌకర్యం లేని వినియోగదారులకు ఈ సాంకేతికత ఎంతో ఉపయోగకరంగా మారే అవకాశం ఉంది. గంటల తరబడి ఛార్జింగ్ కోసం వేచి ఉండాల్సిన అవసరం లేకపోవడం దీని ప్రధాన ప్రయోజనంగా చెప్పవచ్చు. నగర అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ కారును కాంపాక్ట్ డిజైన్‌తో రూపొందించారు. రద్దీ రహదారులు, ఇరుకైన వీధులు, పరిమిత పార్కింగ్ ప్రదేశాల్లో కూడా సులభంగా వినియోగించుకునేలా దీని నిర్మాణం ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఆధునిక సాంకేతిక ఫీచర్లు, డిజిటల్ కనెక్టివిటీ, మెరుగైన భద్రతా వ్యవస్థలను కూడా ఈ వాహనంలో అందుబాటులో ఉంచారు. సంప్రదాయ పెట్రోల్, డీజిల్ కార్లతో పోలిస్తే నిర్వహణ వ్యయం తక్కువగా ఉండటం మరో ప్రత్యేకతగా భావిస్తున్నారు. బ్యాటరీ మార్పిడి విధానం విస్తృత స్థాయిలో అమలులోకి వస్తే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం మరింత వేగంగా పెరిగే అవకాశం ఉందని ఆటోమొబైల్ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఛార్జింగ్ సమయంపై ఉన్న ఆందోళనలను తగ్గించి, ఎలక్ట్రిక్ వాహనాలను సాధారణ వినియోగదారులకు మరింత చేరువ చేయడంలో ఈ సాంకేతికత కీలక పాత్ర పోషించవచ్చని వారు పేర్కొంటున్నారు. పర్యావరణ పరిరక్షణ, తక్కువ నిర్వహణ వ్యయం, వేగవంతమైన బ్యాటరీ మార్పిడి వంటి ప్రయోజనాలతో ఈ కొత్త సాంకేతికత భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాల రంగానికి కొత్త దిశను చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# రాణా వేగానికి కంగారూలు బెంబేలు




**ఢాకా, జూన్ 10 :** ఆస్ట్రేలియాపై తొలి వన్డేలో బంగ్లాదేశ్ సంచలన విజయం సాధించిన నేపథ్యంలో యువ పేసర్ నహీద్ రాణా ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తన వేగవంతమైన బౌలింగ్‌తో ఆస్ట్రేలియా బ్యాటర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన రాణా, ప్రత్యర్థి తాత్కాలిక కెప్టెన్ జోష్ ఇంగ్లిస్ వికెట్ తీసిన అనంతరం మైదానంలో చోటుచేసుకున్న సంఘటనతో మరింత చర్చనీయాంశంగా మారాడు. డక్‌వర్త్-లూయిస్ విధానం ప్రకారం 86 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ ఘన విజయం నమోదు చేసిన ఈ మ్యాచ్‌లో రాణా తన బౌలింగ్‌తో ఆస్ట్రేలియా బ్యాటింగ్ క్రమాన్ని కుదేలు చేశాడు. ఛేదనలో భాగంగా 11వ ఓవర్‌లో రాణా విసిరిన వేగవంతమైన బౌన్సర్‌ను ఆడే క్రమంలో ఇంగ్లిస్ బ్యాట్‌కు తగిలిన బంతి వికెట్ కీపర్ చేతుల్లో పడింది. దీంతో వికెట్ దక్కించుకున్న రాణా ఉత్సాహంగా సంబరాలు చేసుకున్నాడు. అయితే ఆ సంబరాల తీరు నచ్చని ఇంగ్లిస్ అసహనానికి గురై రాణాతో వాగ్వాదానికి దిగాడు. కొద్దిసేపు ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగగా, పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా బంగ్లాదేశ్ కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ జోక్యం చేసుకుని ఇంగ్లిస్‌ను శాంతింపజేశాడు. ఆ సమయంలో ఆస్ట్రేలియా జట్టు 51 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో ఉంది. ఇంగ్లిస్ వికెట్ అనంతరం ఆ జట్టు మరింత కష్టాల్లో పడగా, బంగ్లాదేశ్ బౌలర్లు పూర్తి ఆధిపత్యం చెలాయించారు. మ్యాచ్ గమనాన్ని మార్చిన కీలక ఘట్టంగా ఈ వికెట్ నిలిచిందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక రాణా, ఇంగ్లిస్ మధ్య జరిగిన ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. రాణా వేగం, దూకుడైన బౌలింగ్‌పై బంగ్లాదేశ్ అభిమానులు ప్రశంసలు కురిపిస్తుండగా, భవిష్యత్తులో అతడు జాతీయ జట్టుకు ప్రధాన బలంగా మారతాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# భారత్‌కు షాక్

## ఆఫ్ఘనిస్తాన్ వన్డే సిరీస్‌కు హార్దిక్ పాండ్యా దూరం!

**మొహాలి, జూన్ 10 :** ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు ముందు భారత జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గాయంతో ఈ సిరీస్‌కు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల బెంగుళూరులోని బీసీసీఐ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసి ఆడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించిన పాండ్యా, తాజాగా మళ్లీ కాలు నొప్పితో బాధపడుతున్నట్లు సమాచారం. ఆఫ్ఘనిస్తాన్‌తో సిరీస్‌లో ఆడాలనే లక్ష్యంతో గత కొన్ని రోజులుగా పాండ్యా తీవ్రంగా శ్రమించాడు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లో బ్యాటింగ్‌తో పాటు పూర్తి స్థాయి బౌలింగ్ ప్రాక్టీస్ కూడా నిర్వహించాడు. ఏకంగా పది ఓవర్లు బౌలింగ్ చేసి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్నాడు. దీంతో అతడు సిరీస్‌కు అందుబాటులో ఉంటాడని బీసీసీఐ కూడా ప్రకటించింది. అయితే చివరి దశలో మళ్లీ కాలు నొప్పి తిరగబెట్టడంతో జట్టు యాజమాన్యం అతడిని సిరీస్‌కు దూరంగా ఉంచాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. వైద్యుల సూచన మేరకు పాండ్యా మరో రెండు వారాల పాటు బెంగుళూరులోనే ఉండి పునరావాస కార్యక్రమంలో పాల్గొననున్నాడు. బీసీసీఐ వర్గాల సమాచారం ప్రకారం, పాండ్యాకు తీవ్రమైన గాయం ఏదీ కాకపోయినా కాలులోని కొన్ని కండరాలు బలహీనంగా ఉండటంతో నొప్పి వస్తోందని తెలుస్తోంది. భవిష్యత్తులో సమస్య మరింత పెరగకుండా జాగ్రత్త చర్యగా విశ్రాంతి ఇవ్వాలని వైద్య బృందం సూచించినట్లు సమాచారం. ప్రస్తుతం ఫిజియోలు, ట్రైనర్ల పర్యవేక్షణలో అతడు ప్రత్యేక శిక్షణ తీసుకోనున్నాడు. ఇక శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని భారత వన్డే జట్టు గురువారం మొహాలీలో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించనుంది. అక్కడి నుంచి జట్టు ధర్మశాలకు బయలుదేరనుంది. హార్దిక్ పాండ్యా గైర్హాజరీతో జట్టులో ఆల్‌రౌండర్ విభాగంలో మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాండ్యా త్వరగా కోలుకుని మళ్లీ జట్టులోకి రావాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అతని గైర్హాజరీ భారత జట్టుకు లోటే అయినప్పటికీ, యువ ఆటగాళ్లకు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభించనుంది.

# మెస్సీ మెరుపులు.. అర్జెంటీనాకు విజయం

**బ్యూనస్ ఐరెస్, జూన్ 10 :** ప్రపంచకప్‌కు ముందు జరిగిన చివరి సన్నాహక మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఐస్‌లాండ్‌పై 3-0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించి తమ బలాన్ని మరోసారి నిరూపించింది. ఈ మ్యాచ్‌లో గాయంతో కొంతకాలం దూరమైన కెప్టెన్ లియోనెల్ మెస్సీ మైదానంలోకి తిరిగి వచ్చి అభిమానులను అలరించాడు. కేవలం 20 నిమిషాల పాటు మాత్రమే ఆడిన మెస్సీ ఒక గోల్ సాధించడమే కాకుండా మరో రెండు గోల్స్‌కు దారితీసే అద్భుత పాస్‌లు అందించాడు. అతడి రాకతో అర్జెంటీనా దాడులు మరింత పదునెక్కాయి. మ్యాచ్ ఆరంభంలో మెస్సీ ఇచ్చిన అద్భుత పాస్‌ను అందుకున్న స్టార్ ఫార్వర్డ్ లౌటారో మార్టినెజ్ గోల్‌గా మలిచి అర్జెంటీనాకు ఆధిక్యం అందించాడు. అనంతరం మెస్సీ స్వయంగా గోల్ సాధించి జట్టు ఆధిక్యాన్ని రెండింతలు చేశాడు. కొద్ది సేపటికే మరో చక్కటి పాస్‌తో యువ ఆటగాడు థియాగో అల్మాడాకు అవకాశం కల్పించగా, అతడు మూడో గోల్ నమోదు చేశాడు. మెస్సీ నాయకత్వంలో అర్జెంటీనా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించగా, ఐస్‌లాండ్ జట్టు ఒక్క గోల్ కూడా నమోదు చేయలేకపోయింది. ఈ విజయంతో ప్రపంచకప్‌కు ముందు అర్జెంటీనా శిబిరంలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. ప్రపంచకప్‌లో అర్జెంటీనా తన తొలి మ్యాచ్‌ను జూన్ 16న అల్జీరియాతో ఆడనుంది. మెస్సీ ఫిట్‌నెస్, ఫామ్ జట్టుకు ప్రధాన బలంగా మారడంతో టైటిల్ రక్షణపై అభిమానుల్లో ఆశలు మరింత పెరిగాయి.



# కౌంటీ క్రికెట్‌లోకి మానవ్ సుతార్

**ముంబై, జూన్ 10 :** ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న యువ స్పిన్నర్ మానవ్ సుతార్‌కు ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో ఆడే అవకాశం లభించింది. ఇంగ్లండ్‌కు చెందిన వార్‌విక్‌షైర్ కౌంటీ క్రికెట్ క్లబ్‌తో ఆయన స్వల్పకాలిక ఒప్పందం కుదుర్చుకున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన రాజస్థాన్‌కు చెందిన ఎడమచేతి స్పిన్నర్ మానవ్ సుతార్ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టును తీవ్రంగా దెబ్బతీశాడు. రెండో ఇన్నింగ్స్‌లో మరో వికెట్ సాధించి మొత్తం ఏడు వికెట్లతో తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ ప్రదర్శనతో అంతర్జాతీయ క్రికెట్ వర్గాల దృష్టిని ఆకర్షించిన సుతార్‌కు ఇప్పుడు కౌంటీ క్రికెట్‌లో అవకాశాలు దక్కుతున్నాయి. వార్‌విక్‌షైర్ జట్టు తరఫున రోతేసే కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో జరిగే తదుపరి రెండు రౌండ్ల మ్యాచ్‌లలో సుతార్ ఆడనున్నాడు. యార్క్‌షైర్, సోమర్‌సెట్ జట్లతో జరిగే కీలక పోటీలకు ఆయన అందుబాటులో ఉండనున్నట్లు క్లబ్ వెల్లడించింది. మానవ్ సుతార్ దేశీయ ప్రథమశ్రేణి క్రికెట్‌లో కూడా అద్భుతమైన రికార్డును కలిగి ఉన్నాడు. ఇప్పటివరకు 29 ప్రథమశ్రేణి మ్యాచ్‌లు ఆడిన ఆయన 129 వికెట్లు సాధించి తన స్థిరమైన ప్రదర్శనతో గుర్తింపు పొందాడు. ఇంగ్లండ్ పరిస్థితుల్లో కౌంటీ క్రికెట్ ఆడటం ద్వారా సుతార్‌కు విలువైన అంతర్జాతీయ అనుభవం లభించనుంది. ముఖ్యంగా ఆగస్టులో శ్రీలంకతో జరగనున్న టెస్టు సిరీస్‌కు ముందు ఈ అనుభవం అతడి ఆటకు మరింత పదును పెట్టే అవకాశం ఉందని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మానవ్ సుతార్ మా జట్టులో చేరడం ఎంతో సంతోషంగా ఉందని వార్‌విక్‌షైర్ ప్రదర్శన విభాగం డైరెక్టర్ జేమ్స్ థామస్ తెలిపారు. అతడి ప్రతిభ జట్టుకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కౌంటీ క్రికెట్‌లో రాణించి భారత జట్టులో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సుతార్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.



# ఆసియా క్రీడలకు పాకిస్థాన్ యువ జట్టు




**లాహోర్, జూన్ 10 :** జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరగనున్న ఆసియా క్రీడలు-2026 కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు 15 మంది సభ్యులతో కూడిన పురుషుల జట్టును ప్రకటించింది. ఈసారి బాబర్ ఆజం, షాహీన్ అఫ్రిది, షాదాబ్ ఖాన్ వంటి సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చి యువ ఆటగాళ్లకు అవకాశమిచ్చింది. జట్టుకు అనుభవజ్ఞుడైన ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్‌ను కెప్టెన్‌గా నియమించగా, యువ బ్యాటర్ అబ్దుల్ సమద్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ముగిసిన ప్రపంచ టీ20 టోర్నీలో ఫర్హాన్ అద్భుత ప్రదర్శన కనబరిచి జట్టు తరఫున అత్యధిక పరుగులు సాధించాడు. ఇప్పటివరకు 46 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడిన అతడు 1,305 పరుగులు నమోదు చేశాడు. ఇందులో రెండు శతకాలు, పది అర్ధశతకాలు ఉన్నాయి. వైస్ కెప్టెన్ అబ్దుల్ సమద్ ఇప్పటివరకు ఐదు అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడగా, ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో కూడా భాగమయ్యాడు. యువ ఆటగాళ్లకు ప్రాధాన్యం ఇస్తూ పాకిస్థాన్ బోర్డు అకిఫ్ జావెద్, అలీ రజా, మాజ్ సదాఖత్, సాద్ మసూద్‌లకు తొలిసారి అవకాశం కల్పించింది. టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ మెగా క్రీడల కోసం ఎంపికైన ఆటగాళ్లు జూన్ 15 నుంచి 18 వరకు లాహోర్‌లో నిర్వహించే ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొననున్నారు. జాతీయ క్రికెట్ అకాడమీలో జరిగే ఈ శిబిరంలో ఫిట్‌నెస్, పవర్ హిట్టింగ్, మ్యాచ్ పరిస్థితులను ఎదుర్కొనే నైపుణ్యాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు. యువ ఆటగాళ్లతో కూడిన ఈ జట్టు ఆసియా క్రీడల్లో పాకిస్థాన్‌కు పతకం అందించాలనే లక్ష్యంతో బరిలోకి దిగనుంది. సీనియర్ ఆటగాళ్ల గైర్హాజరీలో యువత తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఇది కీలక అవకాశంగా మారింది.

# ఒలింపిక్స్ జట్టులో కోహ్లీ ఉండాల్సిందే: శ్రీశాంత్



**ముంబై, జూన్ 10 :** 128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్ మళ్లీ చోటు దక్కించుకోనున్న నేపథ్యంలో భారత జట్టు కూర్పుపై ఆసక్తికర చర్చలు ప్రారంభమయ్యాయి. 2028లో అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో జరగనున్న ఒలింపిక్స్‌లో భారత జట్టు స్వర్ణ పతక లక్ష్యంతో బరిలోకి దిగనున్న వేళ, మాజీ భారత పేసర్ శ్రీశాంత్ కీలక సూచన చేశాడు. అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని ఒలింపిక్స్ జట్టులో ఎంపిక చేయాలని సెలక్టర్లను కోరాడు. ఒక యూట్యూబ్ కార్యక్రమంలో మాట్లాడుతూ, ఒలింపిక్స్ వంటి ప్రతిష్ఠాత్మక టోర్నీలో కోహ్లీ అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డాడు. విరాట్ కోహ్లీ అనుభవానికి యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ దూకుడు జతైతే భారత జట్టు మరింత బలంగా మారుతుందని శ్రీశాంత్ పేర్కొన్నాడు. సీనియర్, యువ ఆటగాళ్ల సమన్వయంతో జట్టుకు సమతుల్యత ఏర్పడుతుందని చెప్పాడు. 2024 టీ20 ప్రపంచకప్ విజయానంతరం కోహ్లీ టీ20 ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ, అతని ఫిట్‌నెస్ ఇప్పటికీ అత్యున్నత స్థాయిలో ఉందని శ్రీశాంత్ గుర్తు చేశాడు. కోహ్లీ శారీరక దృఢత్వం, మ్యాచ్ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని అతడిని ఒలింపిక్స్ జట్టులోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు. 1900 తర్వాత తొలిసారి ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు అవకాశం లభించింది. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో ఆరు జట్ల చొప్పున టీ20 ఫార్మాట్‌లో పోటీలు నిర్వహించనున్నారు. క్రికెట్‌తో పాటు బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్, స్క్వాష్ క్రీడలకు కూడా చోటు కల్పించారు. ఇక యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ఇటీవల ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. 2026 సీజన్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచి భారత జట్టులో తొలి అవకాశాన్ని దక్కించుకున్నాడు. కోహ్లీ వంటి అనుభవజ్ఞుడితో పాటు వైభవ్ వంటి యువ ప్రతిభ కలిస్తే భారత జట్టు ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకానికి బలమైన పోటీదారుగా నిలుస్తుందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఓ మహాదర్శకుడి నిష్క్రమణ

## భారతీరాజా కన్నుమూత

తమిళ చిత్రపరిశ్రమలో విషాదం.. ■ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

**చెన్నై, జూన్ 10:** తమిళ చలనచిత్ర రంగంలో గ్రామీణ కథలకు కొత్త దిశను చూపించి, వెండితెరపై పల్లెటూరి జీవనాన్ని సహజత్వంతో ఆవిష్కరించిన ప్రముఖ దర్శకుడు భారతీరాజా కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో తమిళ చిత్రపరిశ్రమతో పాటు భారతీయ సినీ రంగం విషాదంలో మునిగిపోయింది. 1941 జూలై 17న తమిళనాడులోని తేని జిల్లా అల్లినగరంలో జన్మించిన భారతీరాజా, 1977లో విడుదలైన '16 వయతినిలే' చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేశారు. ఆ చిత్రం ఘనవిజయం సాధించడంతో తమిళ సినీ పరిశ్రమలో కొత్త ఒరవడికి నాంది పలికారు. అప్పటివరకు స్టూడియోలకు పరిమితమైన చిత్రీకరణను పల్లెలకు తీసుకెళ్లి, గ్రామీణ జీవన విధానాన్ని అత్యంత సహజంగా తెరపై చూపించి ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. అందుకే ఆయనను అభిమానులు, సినీ వర్గాలు 'దర్శక ఇమయం'గా గౌరవించేవారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో 'సిగప్పు రోజక్కల్', 'కిజక్కే పోగుం రైల్', 'ముదల్ మరియాద్రై', 'కరుత్తమ్మ' తదితర చిత్రాలతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. దర్శకుడిగానే కాకుండా నటుడిగానూ తనదైన గుర్తింపు పొందారు.





### అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

భారతీరాజా మృతికి తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భారతీరాజా సినీ రంగానికి అందించిన విశిష్ట సేవలకు గౌరవ సూచకంగా ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ఆదేశించారు.

### సినీ, రాజకీయ ప్రముఖుల నివాళులు

భారతీరాజా మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మెగాస్టార్ చిరంజీవి స్పందిస్తూ భారతీయ సినిమా ఒక అసాధారణ కథకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఆరాధన' చిత్రంలో ఆయన దర్శకత్వంలో పనిచేయడం జీవితాంతం మరిచిపోలేని అనుభవమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, దర్శకుడు రామ్ గోపాల్ వర్మ, నటి ఖుష్బూ తదితరులు సోషల్ మీడియా వేదికగా నివాళులర్పించారు. భారతీయ సినీ రంగానికి ఆయన మరణం తీరని లోటని పేర్కొన్నారు.

### అవార్డులు.. అపార కీర్తి

భారతీరాజా తన సినీ జీవితంలో కేంద్ర ప్రభుత్వ 'పద్మశ్రీ' పురస్కారంతో పాటు ఆరు జాతీయ చలనచిత్ర అవార్డులు, ఆరు తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డులను అందుకున్నారు. గ్రామీణ నేపథ్య కథలను సున్నితమైన భావోద్వేగాలతో మేళవించి ప్రేక్షకులను అలరించిన ఆయన చిత్రాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలిచేలా ఉన్నాయి. భారతీరాజా మరణంతో భారతీయ సినీ పరిశ్రమ ఓ గొప్ప దర్శకుడిని, సృజనాత్మక కథకుడిని కోల్పోయిందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయన సృష్టించిన చిత్రాలు, పాత్రలు, విలువలు చిరకాలం ప్రేక్షకుల మదిలో నిలిచిపోనున్నాయి.




# 'ఆల్ఫా' టీజర్‌తో అలియా అదరహో

యశ్‌రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ నుంచి ప్రేక్షకుల ముందుకు రానున్న ఏడో చిత్రం 'ఆల్ఫా' టీజర్ విడుదలై సినీ అభిమానులను ఆకట్టుకుంటోంది. భారీ యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రముఖ నటి అలియా భట్ ఇప్పటివరకు కనిపించని సరికొత్త అవతారంలో దర్శనమిచ్చింది. దర్శకుడు శివ్ రావల్ రూపొందిస్తున్న ఈ చిత్రంలో అలియా భట్ శిక్షణ పొందిన ప్రొఫెషనల్ హంతకురాలి పాత్రలో కనిపించనుంది. టీజర్‌లో ఆమె శత్రువులపై విరుచుకుపడుతూ, సాహసోపేత యాక్షన్ ఘట్టాల్లో పాల్గొంటూ కనిపించింది. తుపాకీ కాల్పులు, ఛేజ్ సన్నివేశాలు, పోరాట దృశ్యాలు చిత్రంపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ అలియా భట్ తండ్రి పాత్రలో నటిస్తున్నారు. టీజర్‌లో వీరిద్దరి మధ్య ఉన్న భావోద్వేగ బంధాన్ని కూడా చూపించారు. చిన్నప్పటి నుంచే కఠిన పరిస్థితుల్లో పెరిగి, ప్రమాదకరమైన యోధురాలిగా మారిన యువతి కథ చుట్టూ సినిమా తిరగనుందని తెలుస్తోంది. మరో ప్రముఖ నటి శర్వరి కూడా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆమె పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే చిత్ర బృందం వెల్లడించనుంది. ఇద్దరు కథానాయికలు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న అరుదైన భారీ యాక్షన్ చిత్రంగా 'ఆల్ఫా' నిలవనుంది. సినిమాలో ప్రముఖ నటుడు అనిల్ కపూర్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. యాక్షన్, భావోద్వేగాలు, ఉత్కంఠభరిత అంశాలు, వినోదాత్మక ఘట్టాల సమ్మేళనంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. స్పై థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం వచ్చే ఏడాది జూలై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తుండగా, 'ఆల్ఫా'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అలియా భట్ కెరీర్‌లోనే అత్యంత సాహసోపేతమైన పాత్రల్లో ఇది ఒకటిగా నిలవబోతోందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# 'పెద్ది' వివాదంపై అదా శర్మ స్పందన

'ది కేరళ స్టోరీ' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన నటి అదా శర్మ తాజాగా 'పెద్ది' సినిమాలో జాన్వీ కపూర్ పాత్రపై జరిగిన వివాదంపై స్పందించారు. ప్రస్తుతం ఆమె నటించిన 'గవర్నర్' చిత్రం విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో ఈ అంశంపై మీడియా ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. మనోజ్ బాజ్‌పేయి ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'గవర్నర్' చిత్రం 1990లలో దేశం ఎదుర్కొన్న ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో రూపొందింది. దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడటంలో కీలక పాత్ర పోషించిన రిజర్వు బ్యాంకు గవర్నర్ జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'పెద్ది' చిత్రంలో జాన్వీ కపూర్ పాత్రపై సామాజిక మాధ్యమాల్లో జరిగిన విమర్శలు, ట్రోలింగ్ గురించి అదా శర్మను ప్రశ్నించారు. దీనికి స్పందించిన ఆమె తాను ఇప్పటివరకు ఆ సినిమా చూడలేదని, అందువల్ల పూర్తి సమాచారం లేకుండా ఏదైనా వ్యాఖ్యానించడం సరికాదని తెలిపారు. సినీ పరిశ్రమలో తన ప్రయాణం పూర్తిగా భిన్నమని, తాను ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా పరిశ్రమలోకి వచ్చానని చెప్పారు. అందుకే ఇతరుల సినిమాలు లేదా వారి నిర్ణయాలపై అభిప్రాయం చెప్పడం తగదని పేర్కొన్నారు. అయితే ఒక సాధారణ అంశంపై మాత్రం స్పష్టంగా మాట్లాడిన అదా శర్మ, నటులు, దర్శకులు, రచయితలు ప్రాజెక్టులను ఎంపిక చేసుకునే సమయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కళారంగంలో తీసుకునే చిన్న నిర్ణయం కూడా సమాజంపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. మహిళా పాత్రలను బలంగా, విభిన్న కోణాల్లో చూపించే కథలపై తనకు ప్రత్యేక ఆసక్తి ఉందని అదా శర్మ వెల్లడించారు. మహిళల వ్యక్తిత్వం, ఆలోచనలు, భావోద్వేగాలను గౌరవించే కథల్లో నటించేందుకు తాను ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. ఇదిలా ఉండగా, 'పెద్ది' చిత్రంలోని కొన్ని సన్నివేశాలపై వచ్చిన విమర్శల నేపథ్యంలో దర్శకుడు బుచ్చిబాబు సనా ఇప్పటికే స్పందించి క్షమాపణలు తెలిపారు. ప్రేక్షకుల అభిప్రాయాలను గౌరవిస్తూ అభ్యంతరకరంగా భావించిన కొన్ని సన్నివేశాలను తొలగించినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ నేపథ్యంలో అదా శర్మ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. వివాదంపై నేరుగా స్పందించకుండా, సినిమాలు మరియు పాత్రల ఎంపికలో బాధ్యత అవసరమని ఆమె చేసిన వ్యాఖ్యలకు పలువురు మద్దతు వ్యక్తం చేస్తున్నారు.



# ధనుష్ మూవీలో క్రేజీ రోల్!

సహజ నటనతో కోట్లాది మంది అభిమానుల మనసులు గెలుచుకున్న లేడీ పవర్ స్టార్ సాయిపల్లవి మరో విభిన్న పాత్రలో కనిపించబోతున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రముఖ నటుడు ధనుష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న కొత్త చిత్రంలో ఆమె శక్తివంతమైన పోలీసు అధికారిణి పాత్రను పోషించనున్నట్లు సమాచారం. 'అమరన్' చిత్రంతో ఘన విజయాన్ని అందుకున్న దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ధనుష్ కెరీర్‌లో 55వ చిత్రంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు సాయిపల్లవి పేరు వినిపించడంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. ఇప్పటివరకు ప్రేమకథలు, కుటుంబ భావోద్వేగాలు, సహజమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న సాయిపల్లవి, తొలిసారి కఠినమైన పోలీసు అధికారిణి పాత్రలో కనిపించనున్నారనే వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. బాధ్యతాయుతమైన, ధైర్యవంతమైన అధికారిణి పాత్రలో ఆమె నటన ఎలా ఉంటుందో చూడాలని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో సాయిపల్లవి పాత్ర కథకు కీలకంగా ఉండబోతోందని తెలుస్తోంది. కేవలం కథానాయిక పాత్రకే పరిమితం కాకుండా, కథను ముందుకు నడిపించే శక్తివంతమైన పాత్రను దర్శకుడు రూపొందించినట్లు ప్రచారం సాగుతోంది. 'అమరన్' చిత్రంలో భావోద్వేగాలు, యాక్షన్ అంశాలను సమతూకంగా చూపించిన రాజ్‌కుమార్ పెరియసామి, ఈ చిత్రంలో కూడా సాయిపల్లవి పాత్రను ప్రత్యేకంగా తీర్చిదిద్దినట్లు సమాచారం. నటనకు ప్రాధాన్యత ఇచ్చే సాయిపల్లవి ఈ పాత్ర కోసం ప్రత్యేకంగా సిద్ధమవుతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖాకీ దుస్తుల్లో సాయిపల్లవిని చూడటం కొత్త అనుభూతిగా ఉంటుందని, ఆమె నటనతో మరోసారి ప్రేక్షకులను మెప్పిస్తారని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ పాత్రకు సంబంధించి చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ధనుష్ – సాయిపల్లవి – రాజ్‌కుమార్ పెరియసామి కాంబినేషన్‌పై సినీ వర్గాల్లో భారీ చర్చ సాగుతోంది. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com